# ఐక్య ఉపాధ్యాయ

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

సంపుటి - 6 సంచిక -07 కృష్ణా/విజయవాడ జూలై - 2025 పేజీలు - 36 రూ.20.00

కాలానికి తగిన చిత్రం
బాల్యాన్ని ముంచెత్తుతున్న చిత్రం
భవిష్యత్తును ప్రశ్నిస్తున్న చిత్రం
దేశాన్ని భయపెడుతున్న చిత్రం



బోరు బావిలో పడ్డ పిల్లలైనా బయట పడచ్చేమోగాని
దీన్నుంచి బయటకు రావడం అంత ఈజీకాదు



పాఠశాల విద్యాశాఖ కమీషనర్ గారికి యుటియఫ్ రాష్ట్ర నాయకత్వం ప్రాతినిధ్యం



మోడల్ స్కూల్ జాయింట్ డైరక్టర్ వారికి యుటియఫ్ రాష్ట్ర నాయకత్వం ప్రాతినిధ్యం

## సెకండరీ గ్రేడ్ టీచర్లకు మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని నిరసనలు



ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి



శ్రీకాకుళం



ప్రకాశం



యుటియఫ్ రాష్ట్ర కార్యాలయంలో దాచూరి రామిరెడ్డి సంస్మరణ సభ



చిత్తూరు




గుంటూరు



అనంతపురం




కృష్ణా

# ఐక్యఉపాధ్యాయ

**విద్యా విషయక మాసపత్రిక**

**సంపాదక వర్గం**

**కె.సురేష్ కుమార్**
ప్రధాన సంపాదకులు

**సంపాదకవర్గ సభ్యులు**
కె.ఎస్.ఎస్.ప్రసాద్
నక్కా వెంకటేశ్వర్లు
సిహెచ్.శ్రీహరి
సిహెచ్.శ్రీనివాసరావు
జె.రామకృష్ణ


**ఈ సంచికలో...**


| | |
|---|---|
| పద వికాసం | - 04 |
| స్పార్టకస్ (పుస్తక సమీక్ష) | - 05 |
| పోస్టుకార్డు ఆత్మకథ | - 07 |
| ఎమర్జెన్సీ జబ్బుకు... ప్రతిఘటనే మందు | - 08 |
| శాస్త్రంలో శోధన? ఆచారాల ప్రచారమా? | - 09 |
| ఆ చీకటి రోజు మళ్లీ రానున్నాయా? | - 11 |
| ప్రశ్నోత్తరాలు | - 14 |
| అమరుడు (కథ) | - 15 |
| యుద్ధాలు శవాలను, శకలాలను ... | - 18 |
| ఉద్యమ వార్తలు | - 20 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | - 29 |



| | | |
|---|---|---|
| 5 సం॥ చందా : | ` | 850-00 |
| 2 సం॥ చందా : | ` | 375-00 |
| సం॥ చందా : | ` | 200-00 |

**Union Bank Online**

**A/c No. 346402010025027**

**IFSC Code : UBIN0534641**



**ఐక్యఉపాధ్యాయ**
యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2973763
MobileNo. : 9494112533
Website : www.aputf.org
E-mail : ikyopadhyaya1975@gmail.com


# హక్కుల హరణానికి యాభై ఏళ్ళు

మన ఐక్య ఉపాధ్యాయ పత్రిక పుట్టి శైశవ దశలో ఉండగానే ఎమర్జెన్సీ నిరంకుశత్వాన్ని ఎదుర్కొని కాలపరీక్షకు నిలబడింది. 1975 లో ఆనాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం జూన్ 25 అర్ధరాత్రి దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వందలాది మంది ప్రతిపక్ష నాయకులను రాత్రికి రాత్రి అరెస్టు చేసి జైల్లో కుక్కింది. పత్రికల నోరు నొక్కింది, సెన్సార్ షిప్ విధించింది. సమ్మెలను నిషేధించింది. వందలాది కార్మిక నాయకులను చెరసాలలో వేసింది. విద్యార్థి నాయకులను నిర్బంధించింది. నిరసన తెలిపే హక్కును కూడా తొలగించింది. ఎన్నికలు రద్దు చేశారు. వేతనాలను స్తంభింప చేశారు. సెలవులలో కోతపెట్టారు. లే ఆఫ్ లను చట్టబద్ధం చేశారు. కరువు భత్యాన్ని సగానికి తగ్గించారు. పత్రికల ప్రాథమిక హక్కులు తుడిచిపెట్టబడ్డాయి. పేదల ఇళ్ళను నేలమట్టం చేశారు. దేశవ్యాప్తంగా బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగాయి. లక్ష మందికి పైగా ప్రతిపక్ష నాయకులు, అసమ్మతి వాదులను రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. దీనికి యుటీయఫ్ నాయకులేమి మినహాయింపు కాదు. ఆనాటి యుటీయఫ్ రాష్ట్ర నాయకులు వత్సవాయి సూర్యనారాయణరాజు, కర్రెన్న గారు సైతం అరెస్టు అయ్యారు. అనేకమంది రాష్ట్ర, జిల్లా నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లవలసి వచ్చింది. వందలాదిమంది జర్నలిస్టులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, విద్యార్థి నాయకులు, రాజకీయ పార్టీల కార్యకర్తలను సైతం నిర్బంధించారు. "మీసా" వంటి క్రూరమైన చట్టాలను ప్రజలను విచారణ లేకుండా జైలులో పెట్టడానికి ఉపయోగించారు. చాలామందిని పోలీసు కస్టడిలో హింసించారు. కొందరిని చంపారు కూడా. ఇంకొందరికి ఉరిశిక్షలు వేసి అమలు చేశారు.

ఈ సంఘటనలన్నీ ఎప్పుడో 50 ఏళ్ల క్రితం కాక ఇప్పుడే మన కళ్ళముందే మన అనుభవంలోనే జరుగుతున్నట్లు అనిపిస్తుంది. నిజమే! ఆనాటి ఎమర్జెన్సీ పరిస్థితులను మరల మనము గత దశాబ్ద కాలంగా అనుభవిస్తున్నాము. ఇప్పుడు మరింత వేగవంతంగా, నిరంకుశంగా మన చుట్టూ జరుగుతున్నాయి. ఇప్పటి కేంద్ర ప్రభుత్వము, దాని ప్రభావంతో రాష్ట్ర ప్రభుత్వాలు పౌరులకుప్రాథమిక హక్కులను ఇవ్వ నిరాకరిస్తున్నాయి. రాజ్యాంగ ఉల్లాంఘనలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. రాజ్యాంగం పట్ల, రాజ్యాంగ విలువల పట్ల ఏమాత్రం గౌరవం లేకుండా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. కార్పొరేట్లకు తప్ప మిగిలిన అన్ని వర్గాల ప్రజలను అవి వంచిస్తున్నాయి. అవును.. మనం "అప్రకటిత ఎమర్జెన్సీ" కాలాన్ని అనుభవిస్తున్నాము. దీన్ని అధిగమించాలంటే ప్రతిఘటించడమే మార్గం. అన్ని వర్గాల ప్రజలతో కలిసి పోరాటమే శరణ్యం. జూలై 9న లేబర్ కోడ్స్, నిరంకుశ రైతు, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా దేశంలో అన్ని రైతు, కార్మిక సంఘాలు "సార్వత్రిక సమ్మె"కు పిలుపునిచ్చాయి. విద్యార్థి, యువజన, మహిళ, రైతు వివిధ వర్గాల ప్రజలందరూ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పని గంటలు పెంచడం, పోరాటాలను సహించక పోవడం, భవిష్య నిధి, పెన్షన్ నిధులను ప్రైవేటీకరించడం వంటి దుర్మార్గపు విధానాలతో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచిస్తున్నది. దానికి వంత పాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వమూ ఆ విధానాలనే అమలు చేస్తున్నది. పి.ఆర్.సి, ఆర్థిక బకాయిల చెల్లింపు వంటి సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సాచివేత వైఖరి ప్రదర్శిస్తున్నది. ఈ విధానాలను ప్రశ్నిస్తూ ప్రతిఘటిం చడమే సరైన మార్గం. కనుక, జూలై 9న కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతునిద్దాం!

**ఇంక్విలాబ్ జిందాబాద్!!**

PRINTED AND PUBLISHED BY **KANDALA SATYA SUBRAHMANYA PRASAD**, ON BEHALF OF A. P.UNITED TEACHERS FEDERATION, PRINTED AT PRAJASAKTI PRINTERS&PUBLISHERS PVT LTD, D.NO.27-30-4, AKULAVARI STREET, GOVERNERPET, VIJAYAWADA- 520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT A. P.UNITED TEACHERS FEDERATION, 27-31-11, PALAPARTHIVARI VEEDHI, GOVERNERPET, VIJAYAWADA.520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH. **EDITOR : K SURESH KUMAR**

## పద వికాసం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | ■ | 3 | 4 | | ■ |
| 5 | ■ | | ■ | 6 | ■ | | ■ | 7 |
| 8 | | ■ | 9 | | | ■ | 10 | |
| ■ | ■ | 11 | ■ | | ■ | 12 | ■ | ■ |
| 13 | | | | ■ | 14 | | | |
| ■ | ■ | | ■ | 15 | ■ | | ■ | ■ |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | 19 |
| | ■ | 20 | ■ | | ■ | 21 | ■ | |
| ■ | 22 | | | ■ | 23 | | | ■ |

## గత జూన్ నెల సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 చం | ద | 2 మా | మ | ■ | 3 బా | 4 సు | మ | 5 తి |
| ద్ర | ■ | త | ■ | 6 ప | ■ | ఖ | ■ | రు |
| 7 బా | లు | ■ | 8 బ | నా | నా | ■ | 9 న | గ |
| బు | ■ | 10 వా | ■ | జి | ■ | 11 సా | ■ | లి |
| ■ | 12 అ | ర | క | ■ | 13 ఆ | వి | రి | ■ |
| 14 ఉ | ■ | ధి | ■ | 15 శ్ర | ■ | త్రి | ■ | 16 ర |
| 17 పా | ప | ■ | 18 ల | వ | యు | ■ | 19 అం | చ |
| య | ■ | 20 క్షే | ■ | ణం | ■ | 21 పో | ■ | యి |
| 22 ము | ఖ్య | మం | త్రి | ■ | 23 త | రు | వా | త |

### ఆధారాలు

– యం.జోగిరాజు

**అడ్డం**

1) గాలిలో ఎగిరేది
3) సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రం
8) ధనుస్సు
9) రాత్రి అన్నం
10) పాలతో చేసేది
13) తోక తెగిన కృష్ణా జిల్లా రాకెట్ ప్రయోగ కేంద్రం
14) క్షేమం
17) ఒక కాలువ పేరు
18) యూరప్ కరెన్సీ
22) క్యూబా రాజధాని
23) కూనలమ్మ రచయిత

**నిలువు**

2) తల్లి
4) సూర్యుడే
5) స్వర్గం
6) సపోర్టు
7) ఒక చిన్న రాష్ట్రం
11) సముద్రంలో వచ్చేవి
12) ట్రాన్స్‌ఫర్
15) రామకృష్ణ కవి ఇంటి పేరు
16) ధర
19) పచ్చడి దీనిలోనే రుచి
20) ఒక కంప్యూటర్ భాష
21) పద్ధతి

...(సమాధానాలు వచ్చే సంచికలో..)

### పాఠకులకు సూచన

పూర్తి చేసిన పదవికాసం 2025 జూలై 20లోగా ఐక్య ఉపాధ్యాయ పత్రికకు పోస్టు ద్వారా పంపాలి. కరెక్టుగా పూర్తి చేసి పంపిన పాఠకుల పేర్లు వచ్చే సంచికలో ప్రచురించ బడతాయి. సమాధానాలు పంపిన మొదటి పదిమందికి తగిన బహుమతి అందజేయబడుతుంది.


### ఐక్యఉపాధ్యాయలో ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| 4వ కలర్ పేజీ | రూ. | 30,000.00 |
| 2,3 కలర్ పేజీ | రూ. | 20,000.00 |
| లోపలి కలర్ పేజీ | రూ. | 15,000.00 |


## మా పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివిస్తాం



ప్రైవేటు బడుల బస్సులను ఆపేసిన గ్రామస్థులు

తెలంగాణా రాష్ట్రం కరీంనగర్ జిల్లా ఎల్లమ్మ తాండ గ్రామస్థులు సామాజిక స్పృహతో కూడిన చైతన్యంతో తమ గ్రామ విద్యార్థులను ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అందిస్తూ జీవిత పాఠాలు నేర్పుతున్న ప్రభుత్వ బడుల్లోనే చదివిస్తామని, తమ గ్రామానికి ప్రైవేటు బడుల బస్సులను రానివ్వమంటూ ఆ తాండాకు వచ్చిన సదరు బస్సులను రోడ్డుపై ఆపేసి ఇక ఎన్నడూ తమ గ్రామానికి రావద్దంటూ రోడ్డుపై రాస్తారోకో ద్వారా ట్రాఫిక్ జామ్ చేసి ధర్నా నిర్వహించారు. వారిని అభినందిస్తూ అలాంటి చైతన్యం, సామాజిక దృక్పధం మన తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి పల్లెలో వెల్లివిరియాలని ఆశిస్తూ ఆ స్ఫూర్తితో ప్రభుత్వ బడులను కాపాడుకొనేందుకు మన వంతు కృషి చేద్దాం.




స్పార్టకస్ ఇది రోమన్ పాలక వర్గాలను ఎదిరించి, గడగడ లాడించిన ఓ బానిస వీరుడి చరిత్ర. ఎన్నడో క్రీస్తు పూర్వమే స్వేచ్ఛకోసం, కనీస మానవ గౌరవం కోసం తెగించి పోరాడిన ఈ విప్లవయోధుడి కథ శతాబ్దాలుగా మానవ జాతిని ఉత్తేజం చేస్తూనే ఉంది. ఎంతోమంది రాజకీయ ఆలోచనాపరులనూ కదిలించింది. స్పార్టకస్ ను ""ప్రాచీన చరిత్ర మొత్తం మీద మనకు కనిపించే అద్భుత నాయకుడని"" కీర్తించటమే కాదు, 'నాటి శ్రామికవర్గపు నిజమైన ప్రతినిధి'గా కూడా అభివర్ణించారు కార్ల్ మార్క్స్.

ఈ నవలను హోవర్డ్ ఫాస్ట్ 1951లో రాశారు. మెక్కార్తిజం అణచివేత రోజుల్లో దీన్ని ప్రచురించేందుకు ఎవరూ ముందుకు రాకపోతే తానే స్వయంగా ప్రచురించారు. అక్కడి నుంచీ ఇది కొన్ని లక్షల కాపీలు అమ్ముడుపోయింది. దాదాపు ప్రపంచ భాషలన్నింటిలోకి అనువాదమైంది. ఆంగ్లంలో వెలువడిన నాలుగేళ్లకే తెలుగు పాఠకులకూ చేరువై, అప్పటి నుంచీ తెలుగు నాట లక్షలాది పాఠకులను ప్రభావితం చేస్తూనే ఉంది. స్పార్టకస్ జీవితం సినిమాగా, టీవీ సీరియల్ కూడా ఎంతో ఆదరణ పొందింది.

"పాలక వర్గం చేతుల్లో దోపిడీకి గురవుతున్న జనాలు ఉగ్ర నరసింహులుగా మారి విజృంభించగలరన్న సత్యాన్ని చరిత్రలో మొట్టమొదటిసారిగా చాటి చెప్పినవాడు స్పార్టకస్. అందుకే ఈ పేరు చెప్తే దోపిడీదారులందరికీ ఇప్పటికీ బెదురు.



ఎం.జోగిరాజు
కృష్ణా జిల్లా

ఈ నవల్లో స్పార్టకస్ న్యాయం, ధర్మం మనకి కనిపిస్తాయి. జీవితమే అతనికి అన్యాయం చేసింది. కాకపోతే చరిత్ర మాత్రం అతనికి న్యాయమైన స్థానం ఇచ్చి పేదవారి తిరుగుబాటు జెండాగా అతణ్ణి ఎగరేసి నిలబెట్టింది. అందుకే ఆ జెండా అంటే పెద్దలకి గడగడ, చిన్నలకి మిలమిల.

హోవర్డ్ ఫాస్ట్ స్పార్టకస్ ప్రచురించిన నాలుగేళ్ళకే తెలుగులోకి అనువదింపబడి, ప్రచురింపబడటం తెలుగు పాఠకుల అదృష్టంగా చెప్పుకోవాలి. దీనిని ఆకెళ్ళ కృష్ణమూర్తి గారు అనువదించగా విశాలాంధ్ర వారు 1955లో ప్రచురించారు. స్పార్టకస్ ఇంగ్లీషులో వందలాది ముద్రణలకు నోచుకుని, అన్ని ప్రధాన బాషలలోకి అనువదింపబడి లక్షలాది పాఠకులను ప్రభావితం చేసింది. ఇంతటి ఆదరణ పొందిన పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 1982లో (అంటే తొలి ప్రచురణ జరిగిన 27సం॥కు) రెండవ ముద్రణగా (రాచకొండ విశ్వనాథ శాస్త్రి ముందు మాటతో) ప్రచురించింది. ఆకెళ్ళ కృష్ణమూర్తి గారు "స్పార్టకస్"ని సమర్థంగా అనువదించారు. అయితే ఆధునిక కాలాన్ని, పాఠకుల్ని దృష్టిలో ఉంచుకుని పునరుక్తుల్ని, సుదీర్ఘ వివరణలను తొలిగించి నిడివి తగ్గిన 'స్పార్టకస్' గా మార్చటం జరిగింది.

స్పార్టకస్ ఒక థ్రేసియన్ గ్లాడియేటర్. అతను రోమన్ రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా జరిగిన పెద్ద బానిస తిరుగుబాటు అయిన థర్డ్ సర్వైల్ వార్‌లో తప్పించుకున్న బానిస నాయకులలో ఒకడు. అతని జీవితం యొక్క చారిత్రక కథనాలు ప్రధానంగా ప్లూటార్క్ మరియు అప్పియన్ నుండి వచ్చాయి, అతను మరణించిన ఒక శతాబ్దం తర్వాత ఈ పుస్తకం వ్రాసారు.

ఈ పుస్తకం మొత్తం ఎనిమిది భాగాలుగా వ్రాయబడింది. రాక్షసి బొగ్గులే ఒకానొక పద్ధతిలో వజ్రపురాళ్లు అవుతాయని అంటారు. మనుషులు విప్లవ వీరులుగా ఆ పద్ధతిలోనే అవుతారని స్పార్టకస్ చరిత్ర మనకి నిరూపిస్తుంది. పీడన శక్తి వస్తువులనే కాదు మనుషుల్ని కూడా మారుస్తుంది.

విప్లవ వీరులు ఆ పద్ధతిలోనే తయారవుతారని, బానిసత్వం వస్తువుల్నే కాదు, మనుషుల్ని కూడా మారుస్తుంది అని నిరూపిస్తుంది స్పార్టకస్ జీవితం.

లోకంలో మనిషికి నిత్యావసరమైన వస్తువులన్నింటినీ మనుష్యుల్లో కాయకష్టం చేసేవాళ్లే ఉత్పత్తి చేస్తుంటారు. ఆ శ్రమ ఫలితం మాత్రం వాళ్లకి దక్కదు. ఇది స్పష్టంగా అందరికీ కనిపిస్తున్నదే. కాని, అలా దక్కకపోడానికి కారణం అదృష్టం అనో, లేక దురదృష్టం అనో లేక పూర్వజన్మల మీదనో, మరి దేనిమీదనో తోసేస్తారు. అలా ఎవరు తోసేస్తారు? అని ప్రశ్నిస్తే, ఆ శ్రమపడేవారి కష్టఫలితాన్ని ఎవరైతే దోచుకొంటున్నారో వారే నని సమాధానం చెప్పవలసి ఉంటుంది. దోపిడీచేసే వర్గాలే దాదాపు ప్రతి దేశంలోనూ పాలకవర్గాలుగా ఉంటూ వస్తున్నాయని చరిత్ర ఏమాత్రం చదువుకున్నా మనకి తెలుస్తుంది.

# ఎనీ టైమ్ బుక్స్




పౌరుల బిజీ జీవితానికి కాస్త విరామం, మానసిక ఉల్లాసం, విజ్ఞాన వికాసం కొరకు మరియు నేటి తరంలో తగ్గిపోతున్న పుస్తకపఠనాన్ని పెంచడానికి ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ (ELUDA) ATM తరహాలో ATB (ఎనీ టైమ్ బుక్) బాక్స్ లను సామాజిక స్పృహతో ఉచితంగా నిర్వహిస్తున్నది. వాస్తవానికి వారు వీటిని "బుక్ నూక్స్" పేరుతో నిర్వహిస్తున్నప్పటికీ ఏలూరు నగర ప్రజలు మాత్రం "ఎనీ టైమ్ బుక్ బాక్స్" అనే అంటున్నారు. ఇందులో పిల్లల పుస్తకాల దగ్గరనుండి అన్ని రకాల అకడమిక్, ప్రొఫెషనల్ మరియు పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు సాహిత్య, సామాజిక, రాజకీయ పుస్తకాలు కూడా తెలుగు మరియు ఆంగ్ల భాషల్లో ఉన్నాయి. వీటి బాధ్యతను ఉదయం, సాయంత్రం సంస్థ ఉద్యోగులు చూస్తారని, ప్రస్తుతం ఏలూరు నగరంలో 3 చోట్ల ఈ బాక్స్ లను పెట్టారని మరో 100 ప్రదేశాలను ఎంపిక చేశారని, వీటికి తాళాలేవీ ఉండవు.. ఎవ్వరి నిఘా ఉండదని ఏలూరు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. మొదట పుస్తకాలు తీసుకెళ్లి తిరిగి తెచ్చేవారు కాదని ఇప్పుడు అందులో క్రొత్త పుస్తకాలు తెచ్చిపెడుతున్నారని "మీకు కావలసిన పుస్తకాలు తీసుకోవచ్చు - మీకు అవసరం లేని పుస్తకాలు ఇక్కడ పెట్టవచ్చు - మీరు ఇక్కడే పుస్తకాలు చదవవచ్చు" అనే నినాదంతో "సామాజిక యాజమాన్యం ద్వారా అధ్యయన సంస్కృతి" పెంచడమే దీని లక్ష్యమని, దీని కొరకు పుస్తకాలు పంపాలనుకొంటే elurubooknooks.com ద్వారా పంపవచ్చన్నారు. ఇలాంటి ATBలు అన్ని చోట్ల ఉంటే ఎంత బాగుంటుందో... మన పాఠశాల పరిధిలో గాని, మన నివాస ప్రాంతంలో గాని వీటిని అమలు చేయవచ్చేమో ఆలోచించండి. ఏమైనా హ్యాట్సాఫ్ టు ELUDA.



మనం ఎవరి కష్టంమీదైతే బతికేస్తామో, ఎవరి కష్టం తాలూకు ఫలితాన్నయితే దోచుకుంటామో వారిని గడ్డిపోచల్లా చూస్తాం, వారిని చూసి అసహ్యించుకుంటాం. వారు మనకంటె బలహీనులనో, తెలివితక్కువ వారనో, మనకంటే నల్లగానో, తెల్లగానో ఉన్నారనో, మనకంటే తక్కువ జాతివారనో మనకి మనం చెప్పుకొని, ఆ కారణం వల్లనే వారి అవస్థ అలా ఉన్నదని సమాధానాలు చెప్పుకొని, వాళ్ళ "తక్కువ" తనానికి తప్పుడు కారణాలు అంటగట్టి, మన దోపిడీని మట్టుకు నిరాటంకంగా సాగించుకునేందుకు గానూ మనం సర్వప్రయత్నాలూ చేస్తూ ఉంటాం.

అయితే–

దోపిడీ కాబడేవాడు ఎప్పుడో ఒకప్పుడు తప్పక తిరుగుబాటు చేస్తాడని ఈ ఇరవయ్యో శతాబ్దపు ప్రతిదేశపు దోపిడీ పాలక వర్గానికీ కూడా స్పష్టంగా తెలుసు. కాని, ఈ నిజాన్ని స్పార్టకస్ తిరగబడేవరకూ కూడా ఆనాటి రోమన్ పాలకవర్గం కనుక్కోలేక పోయింది. అందువల్ల తొలుత దెబ్బతింది. తరువాత, నిలదొక్కుకొని తిరుగుబాటుని అణచివేయగలిగింది.

పాలకవర్గం స్పార్టకస్ నుంచి పాఠాలు నేర్చుకొంది. స్పార్టకస్ తరవాత ఈ రోజుకి కూడా పాశ్చాత్య దేశాల పాలకవర్గాల ఏకైక లక్ష్యం (ఇప్పుడు మన దేశంలోని పాలకవర్గపు లక్ష్యంలాగే) ఏమిటీ అంటే :

శ్రామిక వర్గాన్ని ఎన్నటికీ అధికారంలోకి రానివ్వకూడదు. వారిని ఎల్లకాలం అణచి ఉంచాలి. అందుకు ఎల్లప్పుడూ సర్వసిద్ధంగా ఉండాలి.

అదీ ఆ లక్ష్యం.

అందువల్లనే స్పార్టకస్ కు అంతటి ప్రాముఖ్యత..

ప్రధానంగా బానిసల కష్టాన్ని ఉపయోగించుకుని బాగుపడిన రోమన్ పాలకవర్గం ఆ బానిసల్ని ఎంత నీచంగా హేయంగా చూసి వారి యెడల ఎంత దుర్మార్గం గా దారుణంగా అమానుషం గా ప్రవర్తించిందో ఈ నవల చదివితే తెలుస్తుంది. ఇప్పటికి కూడా దోపిడీ పాలకవర్గాలు శ్రామిక వర్గాల యెడల ఇలాగే ప్రవర్తిస్తున్నాయని ఇప్పటి దోపిడీ దేశాల ఏ చరిత్ర చూసినా తెలుస్తుంది. ఐతే ఈ దానవులు ఆ దానవుల్లా ఉండకపోవచ్చు. ఏదైనా దానవులు వేరేమో కానీ దానవత్వం ఒక్కటేగా. **"ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం"** అన్న శ్రీశ్రీ మాటలు గుర్తు రాక మానవు

ఈ పుస్తకం చదవకపోతే ఒక మంచి పుస్తక రాజాన్ని పోగొట్టుకున్నట్లే అనిపించక మానదు.

\

## ఐక్యఉపాధ్యాయ

| | | |
|---|---|---|
| సంవత్సరం చందా | రూ. | 200.00 |
| 2 సం॥ల చందా | రూ. | 375.00 |
| అర్ధ దశాబ్ది చందా (5 సం॥లు) | రూ. | 850.00 |

# పోస్టుకార్డు ఆత్మ కథ



- జోగిరాజు, కృష్ణా జిల్లా

అందరికి నమస్కారం.

నా పేరు పోస్టు కార్డు.

నా వయసు సుమారుగా 150 సంవత్సరాలు.

మనదేశానికి స్వాతంత్రం రాకముందే నేను పుట్టాను.

నా మీద ఎన్నో పొడుపు కథలు, కవితలు ఉన్నాయి.

నన్ను పోస్టు కార్డు అని,

కార్డు ముక్క అని,

తోక లేని పిట్ట అని, ఇలా రకరకాలుగా పిలుచుకునే వాళ్ళు.

పూర్వ కాలంలో అదే పుణ్య కాలంలో శుభకార్యాలకి, బంతులకి, పెళ్లిళ్ళకి, పేరంటాలకి, శుభాలకి, అశుభాలకి, ఉద్యోగాల ఇంటర్వ్యూలకి, ఉద్యోగం వచ్చిన వార్తలకి, ఇలా ఒకటేమిటి సర్వం మా ద్వారానే వార్తలు వెళ్ళేవి.

తొలిరోజుల్లో ఒంటెలు, ఏనుగులు, గుర్రాలు మమ్మల్ని ఒక ఊరి నుండి మరో వూరికి తీసుకెళ్ళేవి.

అక్కడ నుండి సైకిళ్ల మీద పోస్టుమాన్‌లు ఆ ఊరికి ఆ వ్యక్తికి అందిచ్చేవారు.

ఆ రోజుల్లో చదువుకున్న వాళ్ళు చాలా తక్కువే.

వూరిలో బడి పంతులు గారు, పోస్టుమాన్, ఇంకా ఒకరిద్దరూ చదువుకున్న వాళ్ళు ఉండేవాళ్ళు.

ఎక్కువగా పోస్టుమాన్లే చదివి వినిపించే వాళ్ళు. పెళ్లి చూపులకి వచ్చి చూసుకుని వెళ్లిన వాళ్ళకి పిల్ల నచ్చిందని, ఉద్యోగం ఇంటర్వ్యూకి రమ్మన్నారని, కోడలు ప్రసవించిందని,వ్యాపారం చేయటానికి వెళ్లిన భర్త రాసే క్షేమ సమాచారం,పెళ్లి కబుర్లు ఇత్యాధి వార్తలు చదివిన ఆ పోస్టుమాన్ నోరు తీపి చెయ్యని కుటుంబాలు ఉండేవికావు.

ఇక శుభవార్తలకి మాకు నాలుగు వేపుల పసుపు పూసి అలంకరణ చేసే వాళ్ళు. దూరం నుంచే మంచి వార్త వచ్చిందని చదవక ముందే తెలుసుకునే వాళ్ళు ఆ రంగు చూసి.

ఇక అశుభవార్తలకి నాలుగు వేపులా సిరా పూసే వారు. ఆ కార్డును ఇంట్లోకి తీసుకెళ్తే మంచిది కాదని పూరిళ్లలో తాటాకులలో గుచ్చేవారు.

మంచి వార్తలు అందుకున్న వారు ఆ కార్డులని ఎంతో అపురూపంగా ఫ్రేమ్ కట్టించుకునే వాళ్ళు తెలుసా.

పోస్టుమాన్ చదివి వినిపించిన శుభవార్తలని మళ్ళీ మళ్ళీ బడిలో మాస్టారు చేతనో, చదువుకున్న ఇంకొకరిచేతనో ఎన్నోసార్లు చదివించు కున్న తనివి తీరని రోజులు అవి.

మేము స్వాతంత్ర ఉద్యమం లో కూడా అనేక సార్లు పోరాటాలకి ఉపయోగ పడ్డాము. జైలులో ఉన్నవారిని విడిపించాలని, మా దేశం మాకు అప్పగించాలని, జైలులో ఉన్న వారి కష్ట నష్టాలని క్షేమ సమాచారాలను బయటివారికి చేరవేయటం ఇలా మా ద్వారానే రాయబారాలు నడిచేవి.

ఆరోజుల్లో అతి తక్కువ ధరలో అతి ఎక్కువ దూరంలో ఉన్నవారికి చేరువైనవి మా కంటే ఏమి లేవు అంటే అతిశయోక్తి కాదులే.

సమాధానం వెంటనే కావాలి అంటే రిప్లై కార్డు జత చేసే సంప్రదాయం ఉండేది గాలిపటానికి తోకమాదిరిగా.

ఇలా ఎన్ని ప్రయాణాలు చేసినా రైలు, బస్సులు సమయానికి రావటం ఆలస్యం అయ్యేవేమో కానీ కార్డు మాత్రం మనోవేగంతో చేరుకునేది. ఎప్పుడు రాసారు, ఎపుడు పోస్టు చేసారు, ఎప్పుడు చేరింది అనే విషయాలు ఎంతో ఆత్రుత కలిగించేవి.

తొలినాళ్లలో కాని,అర్ధ అణా, అణా,మూడు పైసలు, ఐదు పైసలు, పది పైసలు, 15 పైసలు, 20 పైసలు, ఇలా అర్ధ రూపాయి దగ్గర ఆగింది నా ధర. పేదవాడి నుండి పెద్దవాడి వరకు నన్ను ఉపయోగించని వారు లేరన్నట్టు గా మంచి జాతీయ భావాన్ని తీసుకొచ్చాను నేను .

అన్నట్టు నాకు పుట్టినరోజు ఉంది. జూలై ఒకటో తేదీన పోస్టుకార్డు దినోత్సవం గా జరుపుకుంటారు.

తర్వాత తర్వాత రోజుల్లో బస్సులు, రైళ్లు, విమానాలు కూడా మమ్మల్ని మోసుకెళ్లాయి, తీసుకెళ్లాయి.

పత్రికలకి లేఖలు ప్రజాసేవకులకి వినతులు, హీరో హీరోయిన్లకు అభినందనలకు, ఆహ్వానాలకు ఇలా మమ్మల్ని కుప్పలు, కుప్పలుగా కొనేవారు, రాసేవారు, చదివేవారు.

శుభవార్తలకైతే మేమే వెడ్డింగ్ కార్డు, గ్రీటింగ్ కార్డు, ఇన్విటేషన్ కార్డు, కానీ అదంతా ఒకప్పటి వైభోగం. ఇపుడు, కొనేవారు, రాసేవారు, చదివేవారు కాదుకదా కనీసం మా మొహం చూసేవారే లేరంటే గుండె తరుక్కుపోతోంది.

ఇపుడు రోజులు మారిపోయాయి. అనకూడదు కానీ ఆ దిక్కుమాలిన సెల్ ఫోన్లు వచ్చాక అన్ని తలక్రిందులు ఐపోయాయి.

పోస్టు ఆఫీస్‌లో కూడా మమ్మల్ని ఎవరైనా అడుగుతారేమో అని ప్రతీ రోజు ఎదురుచూసినా అవి ఎండమావులే అవుతున్నాయి.

అన్నట్టు మొన్న ఆ మధ్య సమ్మె చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోస్టుకార్డు ఉద్యమాలు మొదలు పెట్టాలని పిలుపు ఇచ్చారని విన్నాను. అంతే ఎగిరి గంతేసినంత పనయ్యింది.

ఒకతను వచ్చి 50, మరొకమ్మ 100, ఇంకొకరు 200, ఇలా కార్డులు కావాలి అని పోస్టు ఆఫీస్ కి వచ్చి అడుగుతుంటే ఆహాఁ మళ్ళీ మనకి పూర్వ వైభవం వచ్చిందా అనిపించింది.

ఒక్కసారిగా అన్ని సెల్ ఫోన్లు కేవలం మాట్లాడుకోవటానికి మాత్రమే అన్నట్టుగా మారిపోతే ఎంత బాగుంటుంది అనిపిస్తుంది. ఉత్తరాలు, ప్రత్యుత్తరాలు అన్ని మా పోస్టు కార్డుల ద్వారానే జరిగేలా అద్భుతం జరిగితే ఇంకెంత బాగుంటుంది అని ఆశ.

దురాశ, పేరాశ కాదుగా మా కోరిక.

ఉంటాను

సదా మీలో ఒకడిగా

ఉండాలని కోరుకుంటాను.

ఇట్లు

మీ

**పోస్టు కార్డు.**

# ఎమర్జెన్సీ జబ్బుకు... ప్రతిఘటనే మందు



ఎన్.వెంకటేశ్వర్లు
యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు

యాక్సిడెంట్ జరిగిందా... 108కి ఫోన్ చేయండి... గుండెపోటు వచ్చిందా .... వెంటనే బైపాస్ చేయాలి....లక్షలు విలువచేసే టాబ్లెట్లు, ఇంజక్షన్‌లు వాడాలి... లేకపోతే మనిషి ప్రాణానికి ప్రమాదం. అత్యవసరం... ఖర్చు అవుతుంది తప్పదు. వెంటనే ఆపరేషన్ చేయాలి.... సమయం లేదు... అంటూ కార్పొరేట్ ఆసుపత్రిలో డాక్టర్లు చెప్పింది వినాల్సిందే. **ఇది డ్రగ్స్ కంపెనీల, కార్పొరేట్ ఆసుపత్రి యాజమాన్యాల ఎమర్జెన్సీ.**

తుఫాన్లు, వరదలు, భూకంపాలు, కరోనా వైరస్ సందర్భంగా రేషన్, ప్రజల నిత్యావసర వస్తువులపై కోత విధిస్తారు. అత్యవసర సేవలందించే మెడికల్, ఇతర ప్రజారోగ్య శాఖలకు సంబంధించిన సిబ్బందికి ఎవరికి ఎలాంటి సెలవులు మంజూరు చేయరు. **ఇది ప్రకృతి తెచ్చిన అత్యవసర పరిస్థితి.**

నేను చెప్పిందే వేదం. నాకు ఎవరు ఎదురు చెప్పకూడదు. ఏ దేశంపైన అయిన దాడి చేస్తాము. ఏ దేశం నన్ను ప్రశ్నించకూడదు. నా ఆంక్షలు లోబడి ఉండాలి. నేనే యుద్ధం రగిలిస్తా. నేనే శాంతి శాంతి అంటా. ఇరాన్ – ఇజ్రాయెల్, ఇజ్రాయెల్ – పాలస్తీనా, రష్యా–ఉక్రెయిన్, ఇండియా–పాకిస్తాన్ ఏ యుద్ధమైనా మేమే రగలిస్తాం. మేమే ముగిస్తాం. మా అయుధాలు అమ్ముడు పోవటం, మాకు లాభాలు రావడమే ముఖ్యం తప్ప ప్రజల ప్రాణాలు, దేశాల సార్వభౌమాధికారాలు సంబంధం లేదు. ఇంతకీ ఏ యుద్ధం చేసినా ప్రపంచంలో ఆయిల్, గనులు మిగిలిన అన్నిటిమీద నా పెత్తనం సాగాలి. **ఇది ప్రపంచ సామ్రాజ్యవాద దేశం అమెరికా ప్రపంచం మీద ప్రకటించే అత్యవసర పరిస్థితి.**

సొంత పార్టీలో అంతర్గత సంక్షోభం, చాలా రాష్ట్రాలలో అధికార పార్టీ ఓటమి, తన వ్యక్తిగత పదవికి బీటలు, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల నుంచి తిరుగుబాటు, బలమైన ప్రతిపక్షం దేశవ్యాప్త నిరసనలు, కోర్టుల సైతం అభిసంశన తట్టుకోలేని ఆనాటి ప్రధానమంత్రి 1975 జూన్ 25న దేశంలో అర్ధరాత్రి అత్యవసర పరిస్థితిని విధించారు. రాత్రికి రాత్రే ప్రశ్నించే గొంతుకలన్నింటినీ జైల్లో కుక్కారు. పత్రికలపై సెన్సార్ విధించారు. వేతన జీవుల వేతనాలు స్తంభింపజేసారు. కరువు భత్యం సగానికి సగం తగ్గించారు. ఉద్యోగుల, కార్మికుల సెలవుల్లో కోత విధించారు. బలవంతపు కుటుంబ నియంత్రణ అమలు చేసారు. ఎలాంటి విచారణ లేకుండా ప్రమాదకరమైన మీసా లాంటి చట్టాలు అమలు చేసి లక్షలాదిమందిని నిర్బంధించారు. **ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏకతాటి మీద నిలిచి ప్రజల్ని సమీకరించి పోరాడారు. పాలకవర్గం మెడలు ఉంచారు. 1977 మార్చి 21న పాలకులు ఎమర్జెన్సీని ఎత్తి వేయాల్సి వచ్చింది.** తర్వాత ఎన్నికల్లో ఈ పాలకులు ఓడిపోయారు.

మోస్ట్ అర్జెన్సీ ఉదయం 10 గంటలకు సమాచారం అడిగి 10.30ని. అప్‌లోడ్ చేసేయాల్సిందేనని ఆదేశాలు జారీ చేస్తారు. ఉపాధ్యాయులు, పిల్లల హాజరు నిర్దేశిత సమయానికే నమోదు చేయాలి, లేకుంటే చర్యలు తీసుకుంటామని వెంటనే విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తారు. హాజరు నమోదు చేయాల్సిన నెట్‌వర్క్ బిజి బిజిగా ఉంటుంది. ఉపాధ్యాయుల మనసులో గుబులు, దీనివల్ల విద్యార్థుల విద్యపై ప్రభావం పడుతుంది. అయినా మేమనుకున్నదే సాగాలి అని ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రతి 5ని॥లకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుండి హాజరుపై ఒకసారి, పోస్టులపై ఒకసారి ఏదో ఒక వివరాలపై ఒకసారి సమాచారాన్ని అడగడం పరిపాటిగా మారింది. వాళ్ళు చెప్పిందే మేము చేసామని, సంఘాలకు ఉపాధ్యాయులకు మధ్య తంతు పెట్టి, ప్రభుత్వం అనుకున్నదే చేసింది. ఒకవేళ సంఘాలు చెప్పిందే చేసిఉంటే ప్రైమరీ స్కూల్‌లో 41 రోలు వద్ద 3వ పోస్టు ఏది? ఉన్నత పాఠశాలలో 46వద్ద 2వ సెక్షన్ ఏది? సమాంతర మీడియం జాడేది?

**బోధనకే పరిమితం అని ఒకప్రక్క చెబుతూ మరోప్రక్క బోధనేతర కార్యక్రమాలు చుట్టూ ఉపాధ్యాయులను తిప్పుతున్నారు.** నిమిషాలలో సమాచారం ఇవ్వాలంటున్నారు. ఇదో రకమైన ఎమర్జెన్సీని తలపిస్తుంది.

నాడు ఏం జరిగింది అనేది ఆనాడు పోరాటంలో ఉన్నవారు చెబితే తెలుస్తుంది. నేడు ప్రశ్న, ప్రతిఘటనను సహించకపోవడం, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బలహీనపరచడం, భావ ప్రకటన స్వేచ్ఛ లేకపోవడం, లౌకికత్వం ప్రమాదంలో పడడం, ఆలీన విధానం బలహీన పడటం, ప్రభుత్వ రంగ సంస్థలని కారు చౌకగా అమ్మడం, భిన్నత్వంలో ఏకత్వం, శాస్త్రీయత లాంటి అంశాలు నిరాకరణ అప్రకటిత ఎమర్జెన్సీ కిందకు వస్తాయని రాజ్యాంగ నిపుణులు చెప్తున్నారు. మనం ఆలోచించాలి.

ఏతావాత ఏమంటే నేడు చరిత్ర గమనం ఎలా సాగుతుందో కనులారా చూస్తున్నవారు కూడా అంతా బాగానే ఉందని కితాబు ఇవ్వటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మరో ఆశ్చర్యం ఏమంటే **నాడు ఎమర్జెన్సీని సమర్థించిన వారు నేడు మనకి దేశభక్తిని బోధిస్తున్నారు.** ఎలాంటి ఎమర్జెన్సీ అయినా ఎదుటివారి మాట వినాల్సిందే. ఎదురు చెప్పటం, ఎదురుపడటం నిషేధం.

కనక ప్రజాస్వామ్యం నాలుగు పాదాల మీద నాలుగు కాలాలపాటు నిలబడాలంటే ఎలాంటి ఎమర్జెన్సీని అంగీకరించ కూడదు.

**ప్రశ్నా, ప్రతిఘటన కొనసాగించాలి. ఇవే మానవ సమాజం అభివృద్ధికి మూల సూత్రాలు.**

# శాస్త్రంలో శోధన? ఆచారాల ప్రచారమా?

## (ఆవు పేడ వివాదం)



ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని లక్ష్మీబాయి కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఒక ప్రయోగం చుట్టూ దేశ వ్యాపంగా చర్చలు వెల్లువెత్తాయి. ఆవు పేడను శీతలీకరణ ద్రవ్యంగా ఉపయోగించేందుకు చేసిన ప్రయత్నం వివాదాస్పదంగా మారింది. ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఈ చర్యపై తమ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఇది శాస్త్రానికి శ్రమించి చేస్తున్న పరిశోధనల ద్వారా సంపాదించిన విజ్ఞానాన్ని దిగజార్చే చర్యగా అభివర్ణించింది.

సంప్రదాయ భారతీయ వ్యవస్థలో ఆవుపేడను శుద్ధి, ఔషధ గుణాల కోసం ఉపయోగించే చరిత్ర ఉందని అంటున్నారు. అయితే శాస్త్రీయ ప్రమాణాలు, నిగ్రహిత ప్రక్రియలు లేకుండానే ఇలా ఓ విద్యా సంస్థలో అమలు చేయడం శోధనా స్వేచ్ఛపై కాకుండా విద్యా ప్రమాణాలపై ప్రశ్నలు నెలకొల్పుతోంది. విద్యార్థి సంఘాల ఆగ్రహం ఈ ప్రయోగాన్ని అశాస్త్రీయ మైనదిగా తేల్చింది. ఇది సైన్స్‌ను మూఢనమ్మకాలకు దాసోహం చేయాలనే ప్రయత్నం. విద్యాసంస్థలలో విశ్వాసా లను బలవంతంగా నిరూపించే ప్రయత్నం అని చెప్పుక తప్పదని అక్కడి విద్యార్థులు తేటతెల్లం చేసారు. కళాశాల యాజమాన్యం స్పందించాలని కూడా నిరసన చేసారు.



కె.విజయగౌరి
యుటియఫ్ రాష్ట్ర నాయకులు

1. **ఆవుపేడ వంటి సాంప్రదాయక వనరులను** పరిశోధనలలో ఉపయోగించడాన్ని విమర్శించడం అవసరం లేదు. కానీ శాస్త్రీయ ప్రక్రియలకు లోబడి నిరూపించని ప్రకటనలు విద్యార్థుల ఆలోచనా విధానాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. శాస్త్రంలో ప్రామాణికత అత్యంత కీలకం. ఏ అంశం అయిన పరిశోధన, సమీక్ష, ధృవీకరణ అనంతరం మాత్రమే విద్య కార్యక్ర మాల్లో భాగంగా చేయాలి.

   ఈ సంఘటన విశ్వవిద్యాలయాలలో అకడమిక్ స్వేచ్ఛ, సామాజిక బాధ్యతల మధ్య సన్నివేశాన్ని మన ముందుకు తెస్తోంది. అధ్యాపకులు, పరిశోధన స్వేచ్ఛను కోరుకుంటారు. ఇటువంటి స్వేచ్ఛలేని సమాజం నుండి వలసలు వెళ్లిపోవడం చూస్తున్నాము. అదే సమయంలో విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన కల్పించాలంటే ప్రమాణాలు, నిర్దిష్టత ఉండాలి .

2. **భారతదేశంలో ఇటువంటి అశాస్త్రీయ సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయి?**

దానికి అనేక స్థాయిలలో కారణాలు ఉన్నాయి. శిక్షణ విధానం నుంచి రాజకీయ కారణాల వరకు, చైతన్య లోపం నుంచి సాంస్కృతిక తత్వాలు దుర్వినియోగం వరకు చూడవచ్చు.

భారతదేశంలో అనేక రకాల విద్యావిధానాలు అమలు చేశారు. నూతన, సరళీకృత ఆర్థిక విధానాలు అమలుకు పూనుకున్నప్పటికీ నుండి విద్యా వ్యవస్థలో సంస్కరణలు పాలకుల స్వభావాన్ని బట్టి అమలు చేసుకుంటూ వస్తున్నారు. 2015 నుండి అశాస్త్రీయ సంఘటనలు మరింత పెరుగుతున్నాయి. చాలా వరకు దేశంలో విద్యావ్యవస్థ మార్కులపై ఆధారపడి ఉంటుంది. ప్రశ్నించే తత్వం తగ్గుతోంది. ఏది సైన్స్, ఏది నమ్మకం అనే దానిలో తేడా గుర్తించక పోవడం, విమర్శనాత్మక ఆలోచనకు అవకాశాలు తగ్గిపోతున్నాయి.

ఎందువల్లనంటే ఇండియన్ కౌన్సిల్ హిస్టారికల్ రిసెర్చ్ చైర్మన్‌ల్లుగా ఉన్నవాళ్లు ఇతిహాసాలను చరిత్రగా చూపిస్తున్నారు. ప్లాస్టిక్ సర్జరీ, జనిటిక్స్, విమానాల తయారీ వంటి సకల శాస్త్రీయ విజ్ఞానం వేదాలలో ఉందని పాలకులలో ప్రముఖులే వీటిని ఒక విధానంగా ప్రకటిస్తున్నారు. గుజరాత్‌లో స్వామి నారాయణన్ కాలేజీలో జరిగిన సంఘటన అశాస్త్రీయతకు అద్దం పడుతుంది. నెలసరి సమయంలో వంటగది హాస్టల్ లోనికి వచ్చారనే అనుమానంతో 68మంది విద్యార్థులను లోదుస్తులు ఇప్పించి పరీక్షించారు. నెలసరి ఒక శాస్త్రీయమైన జీవన ప్రక్రియలో భాగం అని చెప్పాల్సింది పోయి అపవిత్రత అనే ముద్ర వేసారు.

"బెనారస్' యూనివర్సిటీలో భూతవైద్య కోర్సులను ప్రవేశపెట్టడం చూశాము. అశాస్త్రీయతను, మూఢనమ్మకాలను విస్తృతి చేసి మనువాదానికి బలం చేకూర్చే అంశాలు ముందుకు వస్తున్నాయి. బాధ్యతాయుతమైన స్థానాలలో గలవారు సైన్సు కాంగ్రెస్‌లలో ప్రసంగాలు మరింత ఆశ్చర్యకరం. టెస్టుట్యూబ్ బేబీలు, ప్లాస్టిక్ సర్జరీలు వేదకాలం నాటివి అని ఉపన్యాసాలు ఇవ్వడం. ఇంకా నయం ఈనాటి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కూడా వేదకాలం నాటిదే చెప్పిన ఆశ్చర్యపోనక్కరలేదు..

అంతేకాదు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యావిధానంలో పంచతంత్ర, జాతక, నిష్కామకర్మ, ప్రాచీన సంప్రదాయాలు గురించి బోధించాలని చెప్పింది. ఎక్కడా ఆధునిక విలువలు గురించి చెప్పింది లేదు. కర్ణాటకలో హిజాబ్ ఘటన కుండా మరింత అశాస్త్రీయమైనది. వీటన్నింటినీ పరిశీలిస్తే,

అశాస్త్రీయ భావజాల వ్యాప్తికి బలమైన వ్యవస్థను విస్తరింపచేసే ప్రచారాలు ముందుకు వస్తున్నాయి. శాస్త్రాన్ని విశ్వాసాలతో మిళితం చేయడమంటే అశాస్త్రీయతకు తలుపుతీయడమే. కొన్ని సంప్రదాయక అంశాలను శాస్త్రంగా మలచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వేదాల్లో అన్ని ఉన్నాయని చెప్పడం, గణిత, భౌతిక శాస్త్రాలను హిందూత్వాల దృష్టిలో చూపించడం జరుగుతుంది. అలాంటప్పుడు పరిశోధనలు, అన్వేషణలు, నూతన ఆవిష్కరణలు శాస్త్రవేత్తలు ఎందుకు? నమ్మకాలే ఈ పనులన్నీ చేయవచ్చుకదా? ఇది శాస్త్రవేత్తల విశ్లేషణ కానేకాదు కదా, అంతరిక్షంలో చిక్కుకున్న శాస్త్రవేత్తలను భూమి మీదకు ఎంతో పరిశోధన చేసి, ప్రయోగాలను చేసి తీసుకొచ్చారు కదా, అదే ఎందుకు చేసారు, అందులో గల నూతన ఆవిష్కరణలు ఏమిటి? అనే గొప్ప విషయాన్ని సైంటిఫిక్ టెంపర్‌మెంటుతో ఛాలెంజ్‌గా తీసుకుంది నాసా. సైన్సును ఆధ్యాత్మిక నమ్మకాలతో పోల్చడం, మిళితం చేయడం మొత్తం సమాజం ప్రమాదంలో పడినట్లే.

**3. సామాజిక మాధ్యమాల ప్రభావం :**

సామాజిక మాధ్యమాలలో సైన్సు సమర్ధనలకంటే సెన్సేషనల్ అంశాలే ఎక్కువగా వైరల్ అవుతుంటాయి. సైన్స్ నిరంతరం అన్వేషిస్తుంది. ఉదయం లేచిన నుండి రాత్రి పడుకునే వరకు జీవన ప్రక్రియలు, వృత్తి అంశాలలో సైన్సు ఏ విధంగా ఇమిడి ఉందనే అంశాల జ్ఞానంకంటే సాంప్రదాయాలపై పెరుగుతున్న అతి నమ్మకం, ఇంకా పురాతన సంస్కృతితో నిండి ఉండటం, వాటికి సంబంధించిన అనేక అంశాలు ఆధారాలు అవసరం లేకుండానే నమ్మబలుకుతాయి. ఒక రకంగా చెప్పాలంటే ప్రజల్లో శాస్త్రీయ చైతన్యం లేకపోవడం, సైన్స్‌ను జీవితానికి అనువుగా ప్రజల్లో అవగాహన పెంచకపోవడం. ఇటువంటి అవగాహన "సైన్స్ ఫర్ సొసైటీ" అనే ఆలోచన మొత్తం సమాజానికి కల్పించక పోవడం. ఇది కావాలనే పాలకులు ప్రజలకు చైతన్యం ఉండకూడదు అని కోరుకుంటారు. అందుకునే మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలి. అటువంటి చర్యలకు పాలకులే సుముఖంగా లేరు.

**4. రాజకీయ అంశం:**

ప్రతి అంశంలో రాజకీయ విధానం అంతర్లీనంగా ఉంటుంది. మంచి లేదా చెడు ఆ విధానమే నిర్ణయిస్తుంది. ముఖ్యంగా విజ్ఞానం, సైన్సు, అభివృద్ధి అంశాలలో పాలకులు తీసుకునే విధానాలే నిర్ణయిస్తాయి. దీనికి కీలకమైనది విద్య. అటువంటి విద్యావ్యవస్థలో సూడో సైన్సును ప్రచారం చేసే క్రమంలో నూతన జాతీయ విద్యా విధానం-2020 ద్వారా కొన్నింటిని ఎన్నుకుంది. కొన్ని సందర్భాలలో విద్యాసంస్థలపై ప్రభుత్వం లేదా పార్టీలు భిన్నమైన భావజాలం ప్రచారం చేసేలా ఒత్తిడి తీసుకొస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యను "దేశభక్తి, సంస్కృతి పేర్లతో ఒక నిర్దిష్ట దిశగా మంచి ప్రయత్నాలు అశాస్త్రీయతకు వ్యతిరేకంగా ఉంటాయి. విద్యా విధానాన్ని ప్రమాణాల ఆధారంగా మలచాలి. భావజాలాల ఆధారం గా కాదు. రాజకీయ భావజాలాల దూకుడు గత పదేళ్లుగా దేశంలో ఒక నిర్దిష్ట సాంస్కృతిక జాతీయవాద భావజాలం అధికారంలో ఉంది.

NEPలో కొన్ని అంశాలను అందుకే చేర్చారు. ఏకైక సంస్కృతిని గురించి చెప్పింది. కరిక్యులమ్‌ను, రాజ్యాంగ విలువలను బట్టి కాక ఇతిహాసాల కాల్పనిక గాథల నుండి తయారు చేయాలని ప్రతిపాదించింది. అందుకే ఆవుపేడ లాంటి అంశాలు ముందుకు వస్తున్నాయి. ధాతృత్వ, ధార్మిక మత సంస్థల ప్రతినిధులు అన్ని స్థాయిలలో ఉండాలని, ప్రాచీన ఆచారాలు కరిక్యులమ్‌లో ప్రతిబింబించాలని NEPలో సారాంశం. ఇది విశాలమైన విద్యావ్యవస్థ వలనే జరుగుతుందని మార్పులు తీసుకొచ్చారు. దీని సారాంశం నమ్మకాలు, మతాలు, సూడో సైన్సును పాఠ్యాంశాలలో చొప్పించడమే.

కనుకనే మనిషి పుట్టుకకు సంబంధించిన డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించింది. గొప్ప గొప్ప చరిత్ర కలిగిన పాఠ్యాంశాలను రద్దు చేసింది. విద్యార్థులపై దేశభక్తిని ప్రభావితం చేయగలిగిన అంశాలు, ప్రశ్నించే తత్వాన్ని ప్రభావితం చేయగలిగే అంశాలను తొలగిస్తున్నారు.

మహాత్మాగాంధీ, థీమ్స్ ఇండియన్ హిస్టరీ, పౌరశాస్త్రం, డెమొక్రటిక్ పొలిటికల్స్, పొలిటికల్ సైన్సు, హిందూ, ముస్లిం ఐక్యతకు గాంధీ చేపట్టిన కృషికి సంబంధించిన అంశాలు, భగత్ సింగ్, పెరియారు, నారాయణగురు, బసవడు వంటి ప్రముఖుల పాఠాలను తొలగించారు. జాతీయోద్యమ స్ఫూర్తి, శాస్త్ర పరిజ్ఞానం, విద్యార్థులకు అవసరం లేదనే దృక్పథంతో ఒక రాజకీయ నిర్ణయంగా NEPలో చొప్పించారు.

**ముగింపు**

2015 నుండి అనేక ఘటనలను పరిశీలిస్తే విద్యావ్యవస్థలో సాంస్కృతిక దుర్వినియోగం, రాజకీయ విధానాలు, పరిశోధనల స్వేచ్ఛపై ఆంక్షలు, పరిమితులు, మూఢనమ్మకాలను అరికట్టక పోవడం, అక్షరాస్యతలో వెనుకబాటుతనం, విజ్ఞానంపై విశ్వాసాలను ఆపాదించడం, శాస్త్రం-విశ్వాసాల మధ్య పోరాటం, ఇటీవల శాస్త్ర పరమైన ఆవిష్కరణలకంటే, ఆచారాలను శాస్త్రంగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రజల్లో శాస్త్రంపై అవగాహన కలిగించడం. శాస్త్రం అంటే నమ్మకం కాదు, తెలుసుకోవడం, పరిశీలించడం, ప్రశ్నించడం - దీనివలనే ఆధునిక శాస్త్ర స్ఫూర్తితోనే ప్రకాశించగలదు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా నిలవడమే నిజమైన దేశభక్తి. ప్రభుత్వం మరియు గవర్నర్ వ్యవస్థలు శాస్త్రీయ స్వతంత్రతకు మద్దతు ఇవ్వాలి. మూఢనమ్మకాలు వ్యాప్తి చెందకుండా శాస్త్రీయ ప్రణాళికలను అవలంబించాల్సిన అవసరం ఉంది. అదే మన దేశానికి గొప్ప సంపద. అప్పుడే శాస్త్రం మన జీవన శైలిగా మారుతుంది.



కె.సురేష్‌కుమార్
ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు

# ఆ చీకటి రోజులు మళ్లీ రానున్నాయా?



సరిగ్గా 50 ఏళ్ల క్రితం మనదేశంలో 'ఎమర్జెన్సీ' చీకటి రోజులు మొదలై 21 నెలల పాటు కొనసాగాయి. ఆ పరిస్థితులను జ్ఞాపకం చేసుకుంటే ప్రస్తుత పరిస్థితులు కూడా అందుకు భిన్నంగా ఏమీ లేవు. అప్పటి ఇందిర ప్రభుత్వం నిరంకుశంగా రాష్ట్రపతిచే 'ఎమర్జెన్సీ'ని ప్రకటింప చేస్తే ఇప్పటి మోడీ ప్రభుత్వం (అ) ప్రజాస్వామ్య యుతంగా 'అప్రకటిత ఎమర్జెన్సీ'ని అమలు చేస్తున్నది. దీన్ని అర్థం చేసుకోవాలంటే అప్పుడు ఎమర్జెన్సీకి దారి తీసిన పరిస్థితులు, ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అప్రజాస్వామ్య, నిరంకుశ దారుణాలు తెలుసుకోవలసిఉంది.

లాల్ బహదూర్ శాస్త్రి మరణానంతరం అప్పటి కాంగ్రెస్‌లో ఉన్న బాబు జగ్జీవన్ రామ్, మొరార్జీ దేశాయ్, కామరాజ్ నాడార్ వంటి ఎంతోమంది నాయకుల పోటీని తట్టుకొని అప్పటికే శాస్త్రి కేబినెట్ లో సమాచార మరియు ప్రసార శాఖ మంత్రిగా ఉన్న ఇందిరాగాంధీ 1966లో ప్రధానమంత్రిగా అధికారంలోకి వచ్చారు. 1969 లో బ్యాంకుల జాతీయాకరణ, 1970 లో రాజాభరణాల రద్దు వంటి నిర్ణయాలతో వామపక్ష అనుకూల కార్యకలాపాలు చేపట్టడంతో ప్రజల్లో పలుకుబడి పెరిగింది. దాని వల్ల ఇందిరా గాంధీకి తన మాట చెల్లించుకోగల సామర్థ్యం వచ్చింది. ఈ కార్యకలాపాలు కూడా హఠాత్తుగా ఆర్డినెన్స్‌ల ద్వారా చేపట్టి తన ప్రత్యర్థులను షాక్ కి గురి చేసేవారు. దీంతో ఇందిరను ఆర్థిక రంగంలో 'సోషలిజం', మతపరంగా 'లౌకిక తత్వం', పేదల పక్షపాతంతో మొత్తానికి దేశాభివృద్ధికి అనుకూలురాలిగా భావించేవారు. ప్రజల్లో పలుకుబడి సంపాదించినప్పటికీ ఫ్యూడల్ భావాలతో ఉన్న సీనియర్ నాయకుల నుండి వ్యతిరేకత, తద్వారా సీనియర్ నాయకులంతా ఒక వైపు కాంగ్రెస్(ఓ)గా, యువ నాయకులంతా ఇందిర నాయకత్వంలో కాంగ్రెస్ (ఆర్) గా పార్టీలో చీలిక, మరోవైపు నక్సలైట్ ఉద్యమం లాంటి తీవ్రవాదం, ఇంకోవైపు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వంటి వేర్పాటువాదం, కరువు దుర్భిక్ష పరిస్థితులతో కలగలిసిన రాజకీయ సంక్షోభంలో 1971లో ముందస్తు పార్లమెంట్ ఎన్నికలు ప్రకటించి "గరీబీ హఠావో" అనే శక్తివంతమైన నినాదంతో ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించి, తిరుగు లేని నాయకురాలిగా సత్తా చూపింది. తిరిగి ప్రధాని కావడంతో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ లోను, పార్టీ ఎంపీల్లోనూ ఎక్కువ భాగం ప్రధాని ఇందిర పక్షం వహించారు. పూర్వపు కాంగ్రెస్ పార్టీ పద్ధతుల్లోని అంతర్గత ప్రజాస్వామ్యం వంటివి లేకుండా ఇందిర పార్టీ విధానాలు ఏకపక్షంగా తయారయ్యాయి. పార్టీలోని నాయకులు ఇందిరా గాంధీకి, ఆమె కుటుంబానికి విధేయంగా, సన్నిహితంగా ఉండడం ద్వారానే తాము పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఉన్నత పదవులు పొందగలమని తెలుసుకున్నారు. మితిమీరిన పొగడ్తలు సర్వసాధారణమైపోయాయి. ఆమె నాయకత్వం వహిస్తున్న పార్టీనే అసలైన కాంగ్రెస్ పార్టీగా మారింది. ఆనాటి కాంగ్రెస్ అధ్యక్షుడు డీ.కే.బారువా "ఇందిరానే ఇండియా - ఇండియానే ఇందిర" అంటూ ప్రకటించాడంటేనే ఇందిర ఎంత శక్తిమంతురాలుగా మారిందో మనకు అర్థమవుతుంది.

1971 డిసెంబర్‌లో జరిగిన భారత్-పాక్ యుద్ధంలో పాకిస్తాన్‌ను ఓడించి బంగ్లాదేశ్ విమోచనం కలిగించడంతో సొంత పార్టీ వారే గాక ప్రతిపక్ష నాయకులు కూడా ఇందిరను అపరకాళి, చండీ, దుర్గ అంటూ కీర్తించడంతో ప్రభుత్వంపై ఆమె మరింత పట్టు సంపాదించింది. అప్పటినుంచి చట్టసభలపైనే కాకుండా న్యాయవ్యవస్థపై సైతం ప్రభుత్వ నియంత్రణ కోసం ప్రయత్నించింది. చివరికి ప్రాథమిక హక్కులను సైతం ప్రభావితం చేసే రాజ్యాంగ సవరణలు కూడా ఆమోదించింది. చారిత్రక 'గోలక్‌నాథ్ కేసు'తో మొదలైన న్యాయవ్యవస్థ - శాసన వ్యవస్థల మధ్య యుద్ధం మరో చారిత్రక అత్యున్నత 'కేశవానంద భారతి కేసు' వరకు కొనసాగింది. ఆ కేసులో ఆమెకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పులో ఆమె పక్షం వహించిన న్యాయమూర్తి అజిత్‌నాథ్ రే (AN Ray)ను 3గ్గురు సీనియర్లను పక్కనపెట్టి భారత ప్రధాన న్యాయమూర్తిగా నియమించింది. న్యాయ వ్యవస్థను నియంత్రించే ఆమె ప్రయత్నాలను అటు పత్రికలు, ఇటు సోషలిస్టులు, మార్క్సిస్టులు తీవ్రంగా వ్యతిరేకించారు. దేశంలో వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఆందోళనలు చేపట్టారు. 1973 డిసెంబరు నుంచి 1974 మార్చి వరకూ గుజరాత్‌లో సాగిన నవ నిర్మాణ్ ఉద్యమం అందులో ఒకటి. ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం చినికి చినికి గాలివానగా మారి ప్రభుత్వాన్ని రద్దుచేసేదాకా సాగింది. ఉద్యమం, ఆందోళనల ఫలితంగా ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి

చిమన్ భాయ్ పటేల్ రాజీనామా, ఆపైన రాష్ట్రపతి పాలన విధింపు జరిగాయి. 1974 ఏప్రిల్ లో బీహార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీహార్ ఛాత్ర సంఘర్ష్ సమితి చేసిన విద్యార్థి ఉద్యమానికి గాంధేయ సోషలిస్టు, ప్రముఖ నాయకుడు జయప్రకాష్ నారాయణ్ మద్దతు లభించింది. విద్యార్థి, రైతు, కార్మిక సంఘాలు అహింసాయుతంగా భారతీయ సమాజాన్ని మార్చాలంటూ "సంపూర్ణ విప్లవానికి" పిలుపునిచ్చారు. అలానే రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు, కానీ కేంద్రం అంగీకరించలేదు. నెలరోజుల తర్వాత దేశంలోకెల్లా అతిపెద్ద కార్మిక సంఘం అయిన భారతీయ రైల్వే ఉద్యోగుల యూనియన్ జార్జి ఫెర్నాండేజ్ నాయకత్వాన 20 రోజులపాటు దేశవ్యాప్త సమ్మె చేసింది. వేలాదిమంది కార్మికులను నిర్బంధించి, వారి కుటుంబాలను రైల్వే క్వార్టర్స్ నుంచి తరిమివేసి ఇందిరా గాంధీ ప్రభుత్వం ఈ సమ్మెను దారుణంగా అణచివేసింది. దీనికై పార్లమెంటులో కూడా ప్రభుత్వం చాలా తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంది. 1973-75 కాలంలో ఇందిరా గాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త రాజకీయ ఆందోళనలు చెలరేగాయి. 1966లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇందిరా గాంధీ 10 అవిశ్వాస తీర్మానాలు ఎదుర్కొన్నారు. పార్లమెంట్‌ను ఎదుర్కోలేక అధ్యక్ష తరహా పాలన కావాలని తన మద్దతుదారులతో డిమాండ్ చేయించారు.

ఇదిలావుండగా, 1971 పార్లమెంటరీ ఎన్నికల్లో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రాయ్‌బరేలీ నియోజకవర్గం నుండి ఇందిరా గాంధీ ఎన్నికయ్యారు. అయితే ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎన్నికల కోసం వినియోగించుకున్నారని ఆమె చేతిలో ఓడిపోయిన రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో కేసు దాఖలు చేశారు. రాజ్ నారాయణ్ తరపున రాజకీయ నాయకుడు, న్యాయవాది శాంతి భూషణ్ వాదించారు. ఇందిరా గాంధీ ఈ కేసు విచారణలో భాగంగా విచారణకు హాజరుకావాల్సి వచ్చింది. ఓ కేసు విచారణలో ఓ ప్రధాని ప్రశ్నించబడడం అదే తొలిసారి. ఓటర్లకు లంచాలివ్వడం, ఎన్నికల అక్రమాలు వంటి ఆరోపణలు వీగిపోయినా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సభలకు వేదికలు నిర్మించడం, వాటికి రాష్ట్ర విద్యుత్తు విభాగం నుంచి విద్యుత్తు వినియోగించు కోవడం, అప్పటికి రాజీనామా చేయని ప్రభుత్వాధికారి యశ్‌పాల్ ఆమెకు ఎన్నికల ఏజెంట్‌గా నియమించబడి ప్రచారంలో పాల్గొనడం వంటి ఆరోపణలు బుజువు కావడంతో 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జగ్మోహన్ లాల్ సిన్హా ఇందిరా గాంధీ ఆమె ఎన్నిక చెల్లదంటూ తీర్పునివ్వడమే కాక, ఆరేళ్ళపాటు ఎన్నికల్లో పోటీచేసే అవకాశాన్ని రద్దుచేశారు.

హైకోర్టు నిర్ణయాన్ని ఇందిరా గాంధీ దేశ అత్యున్నత న్యాయ స్థానంలో సవాలుచేశారు. జస్టిస్.వి.ఆర్.కృష్ణ అయ్యర్ 1975 జూన్ 24న హైకోర్టు తీర్పును సమర్థిస్తూ, ఎంపీగా ఇందిర పొందుతున్న అన్ని సౌకర్యాలను ఆపివేయాలని, ఓటింగు నుంచి నిరోధించాలని ఆదేశించారు. తర్వాత వాయిదా ఆగస్టు 11 వరకు ఆమె ప్రధానిగా కొనసాగడానికి అనుమతించారు. ఇక ఇందిరా గాంధీ రాజకీయ ప్రస్థానం ముగిసినట్లే అని పార్టీలోని సీనియర్ నాయకులు ప్రధాని అయ్యేందుకు పావులు కదుపుతున్న సందర్భంలో అధికారలేమిని ఊహించుకోలేని ఇందిరాగాంధీ అప్పటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే సూచనతో నేషనల్ ఎమర్జెన్సీ విధించడం ద్వారా అత్యంత దుర్మార్గమైన దుస్సాహస చర్యకు పూనుకుంది.

భారత రాజ్యాంగంలోని 352(1) అధికరణంలో ఉన్న అంతర్గత అత్యవసర పరిస్థితిని వినియోగించుకొని అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ద్వారా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మరుసటి రోజు అనగా 1975 జూన్ 25 అర్ధరాత్రి 11.45 నిమిషాలకు అధికారికంగా ఎమర్జెన్సీని విధింప చేశారు. ఇది 1977 మార్చి 21లో ఉపసంహరించే వరకు కొనసాగింది. సుప్రీం తీర్పు ద్వారా శిక్షను తప్పించుకొనేందుకు ఆర్టికల్ 329(A)కు 39వ రాజ్యాంగ సవరణ చేయడం ద్వారా ప్రధానమంత్రి మరియు లోక్‌సభ స్పీకర్‌ల ఎన్నిక గురించి సుప్రీంకోర్టుతో సహా ఎవ్వరికి ప్రశ్నించే హక్కు లేకుండా, అది గతానికి కూడా వర్తించే విధంగా ఆగస్టు 7న బిల్లు తయారు చేసి లోక్‌సభలో ఆమోదించడంతో బాటు ఆగస్టు 8న రాజ్యసభలో ఆమోదింపజేసి, ఆగస్టు 9న 17 రాష్ట్రాల అసెంబ్లీలతో అంగీకరింపజేసి ఆగస్టు 10న ఆదివారం అయినప్పటికీ హడావుడిగా రాష్ట్రపతి ఆమోదంతో ప్రకటించారు. దీంతో ఆగస్టు 11న సుప్రీం కోర్టులో ఉన్న కేసు వాయిదాలో సుప్రీంకోర్టు జోక్యం లేకుండా పోయింది. ఎమర్జెన్సీలో ప్రధానంగా ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను 1లక్షా 43వేల మందిని జైలుపాలు చేసి, చిత్ర హింసలకు గురి చేశారు. అన్ని ప్రత్యర్థి రాజకీయ పార్టీల నాయకులను అరెస్ట్ చేశారు. అనేకమంది సిపిఎం నాయకులు, కార్యకర్తలు జైలు పాలవగా మిగిలిన వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆనాటి యుటియఫ్ రాష్ట్ర నాయకులు వత్సవాయి సూర్యనారాయణరాజు, కర్రెన్నలను కూడా అరెస్టు చేసారు. పత్రికలను సెన్సార్ చేశారు. ముంబైలో జరిగిన కాంగ్రెస్ ర్యాలీలో పాట పాడనందుకు ప్రముఖ నేపథ్య గాయకుడు కిషోర్ కుమార్ పాడిన పాటలను ఆకాశవాణిలో ప్రసారం కాకుండా చేశారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రధాని కుమారుడు సంజయ్ గాంధీ యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ముందుండి నడిపిన మాస్ - స్టెరిలైజేషన్ సామూహిక గర్భ నివారణ కార్యక్రమంలో 83 లక్షలకు పైగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించడం వంటి ఇతర దురాగతాలు కూడా ఎన్నో జరిగాయి. ఎంతో మందిని నిర్బంధంగా జైల్లో చిత్రహింసలకు గురి చేయడమే కాకుండా వందలమంది మరణానికి కారకులయ్యారు. ఉరిశిక్షలు విధించారు. సామూహిక దాడులు, అత్యాచారాలు, లూటీలు చేశారు. ప్రభుత్వానికి వ్యతి రేకంగా రాసిన పత్రికలను నిషేధించారు. ప్రింటింగ్ కు విద్యుత్ అంతరాయాలు కలిగించారు. కార్మికుల పనిగంటలు పెంచారు. రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేశారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత వివాదా స్పదమైన చీకటి కాలం ఎమర్జెన్సీ. ఇంతటి క్రూరమైన చర్యను కూడా సంఘసంస్కర్త వినోబాభావే, ప్రముఖ రచయిత కుష్వంత్ సింగ్, పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా, ఒరిస్సా ముఖ్యమంత్రి నందిని శథపతి వంటి ప్రముఖులు సమర్థించారు.

వీరిలో తర్వాతి కాలంలో రతన్ టాటా, నందిని శథపతి వంటి వారు పశ్చాత్తాప పడి తప్పు ఒప్పుకున్నారు. ఈ సమయంలోనే నాటి జెఎన్‌యు విద్యార్థి నాయకుడు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ ఏచూరి జరుగుతున్న ఆకృత్యాలకు బాధ్యత వహించి జెఎన్‌యు ఛాన్సలర్ పదవీకి రాజీనామా చేయాలని ఆమె ఎదుటనే డిమాండ్ చేయగా ఇందిరాగాంధీ మారు మాట్లాడక ఛాన్సలర్ పదవీకి రాజీనామా చేయడం గమనార్హం.

గత 11 ఏళ్లుగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పరిపాలనా తీరు చూస్తే ఇప్పుడు మళ్లీ ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో ఉన్నట్లుగా తోచక మానదు. రాత్రికి రాత్రి పెద్ద నోట్లు రద్దు చేసినప్పుడు ఇలాంటి పరిస్థితి చూశాము. అలా రిజర్వుబ్యాంకును తమ గుప్పిట్లో పెట్టుకోవడం, రాజ్యాంగ సవరణలు లేకుండానే ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడం, రాజ్యాంగ మౌలిక స్వరూపమైన ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక, ఫెడరల్ తత్వానికి తూట్లు పొడవడం, రాజ్యాంగ సమీక్ష చేయాలనుకోవడం, వివిధ రాజ్యాంగ వ్యవస్థలను నియంత్రించడం, అధికారాన్ని వినియోగించుకుని ఈ.డి., సిబిఐ, ఐ టి దాడుల ద్వారా తమ ప్రత్యర్థులపై కక్ష సాధింపు, ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టడం, భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా విమర్శించిన వారిపై అసహనంతో కేసులు పెట్టడం, ప్రబీర్ పుర్కాయస్థ, శర్మిష్ఠా, ప్రొఫెసర్ అలీ ఖాన్ వంటి వారి అరెస్టులు ఎమర్జెన్సీని గుర్తు చేస్తున్నాయి. ప్రొ.సాయిబాబా అరెస్టు, మరణం అచ్చంగా 'ఎమర్జెన్సీ'లో బెంగళూరు కు చెందిన స్నేహలత ఉదంతాన్ని గుర్తు చేస్తుంది. ప్రణాళికా సంఘం రద్దు, జిఎస్‌టి, జాతీయ విద్యా విధానం-2020 ఇవన్నీ రాష్ట్రాల హక్కులు, ఫెడరలిజంను హరించి రాజకీయ కేంద్రీకరణను సూచిస్తాయి. న్యాయమూర్తులను, తీర్పులను నియంత్రించి వారికి అనుకూల తీర్పును పొందడం, ప్రతిఫలంగా సదరు న్యాయమూర్తులకు పదోన్నతులు, గవర్నర్, ఎంపీ వంటి రాజ్యాంగబద్ధ పదవులు ఇవ్వడం, 370 ఆర్టికల్ రద్దు, రాష్ట్రాల రద్దు, సి.ఏ ఏ., ఎన్.ఆర్.సి పేరుతో ఇతర మతాల వారి గుర్తింపు వంటి చర్యలు, నయా ఉదారవాద విధానాల ద్వారా సామ్యవాదానికి గొడ్డలి పెట్టు, మతోన్మాదంతో లౌకికతత్వ భావనకు ముప్పు, ఎలక్షన్ కమిషన్ స్వతంత్రతకు ముప్పు కల్పించడం, ఎన్నికల్లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైనటు వంటి ప్రభుత్వాలను రకరకాల ప్రలోభాలతో కూల్చడము, కేంద్ర ప్రభుత్వానికి అనుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేయడము ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడం ఇవన్నీ రాజ్యాంగంలో జోక్యం లేకుండానే రాజ్యాంగ ఉల్లంఘనలు, పార్లమెంట్‌లో చట్టం లేకుండా, చర్చ లేకుండా చేసేవి అనేకం ఉన్నాయి. ఇదే అప్రకటిత ఎమర్జెన్సీ.

ఎమర్జెన్సీ అనంతరం 1977లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాయ్‌బరేలీలో ఇందిరా గాంధీ ఓటమి సహా కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పొందింది. ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేసి విచారించడమూ జరిగింది. అలాగే ఈనాటి అప్రకటిత ఎమర్జెన్సీ పట్ల కూడా ప్రజలు చైతన్యవంతమైన నాడు చరిత్ర పునరావృతం కాక తప్పదు. చరిత్ర తిరగరాసేందుకు తగిన చైతన్యం ప్రజలకు అందించాలి.



# ఊరి బడి

సిహెచ్. శ్రీనివాసరావు
ఐక్య ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యులు

బడంటే!
భారంగా మోసే
బండెడు పుస్తకాల
గుదిబండ కాదు
బడంటే!
హోం వర్క్ ఒత్తిళ్లు
క్లాస్ వర్క్ కుస్తీలు
బలవంతపు బట్టీలు కాదు
బడంటే!
ఫ్రీ టెస్టులు, గ్రాండ్ టెస్టు
రాతలతో...
లేలేత మనసుల్లో
న్యూనతా బీటలుతీసి,
వారి హృదయాల్ని
స్టార్ బ్యాచ్ల గానో
ఐకానిక్ తరగతులగానో
పగలగొట్టడం కాదు
బడంటే!
అక్షరాలు బుక్కించి
పరీక్షల్లో కక్కించి
ర్యాంకులో!మార్కులో! రప్పించే
శిక్షా కార్ఖానా కాదు
బడంటే!
బహుళ అంతస్తుల భ్రాంతులు
వాహన హవాల జోరూ కాదు
దాబుధర్పాల హంగులు
సామాజిక హోదాల పొంగులు
కాదు
ప్రచార పటోటాపాల
ప్రలోభాలల్లో పడేసి
చదువు'కొనిపించడం' కాదు
పిల్లల మోముల్లో
నవ్వుల కురిపించే
వినోదాల మంజరి బడి
స్నేహాలను మొలిపించి
ఆత్మీయతలు అల్లేసే
అంకురక్షేత్రం బడి
ఆటల్లో తేలింది
పాటల్లో రవళించి
కథా ప్రపంచంలో ఊరేగించే
ఊహల పల్లకి బడి
అడుగడుగునా
విజ్ఞాన పరిమళాలు వెదజల్లే
అక్షరాల పూతోట బడి
విలువలు రంగరించి
విజ్ఞానాన్న పాదిగించే
మనో వికాస మార్గదర్శి బడి
జీవిత సమస్యలకి
బతుకు సాధనలు
నేర్పించే బృహత్తర
బోధనాశాల బడి
ఎందరో
త్యాగధనుల్ని తయారుచేసిన
విద్యాలయం బడి
ఎందరెందరో
లబ్ధప్రతిష్టులందించిన
సృజనాలయం బడి
సకల సదుపాయాల మాలిక
సర్వతోముఖాభివృద్ధి భూమిక
సృజనాత్మక కళల వీచిక
సర్కారీ చదువుల వేదిక
మనందరి చరిత్రను
పుటలు పుటలుగా
దస్త్రాల్లో దాచిపెట్టిన
చారిత్రక సదనం
మన ఊరి బడి
మన పిల్లల్ని
మనబళ్ళోనే చేర్పిద్దాం!
ఆ తరతరాల విద్యా ఝరికి
పూర్వ వైభవం తీసుకొద్దాం!!

# ప్రశ్నోత్తరాలు



నిర్వహణ : టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు
రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్
E-Mail Id
ikyopadhyaya1975@gmail.com

**ప్రశ్న** : 24 సం॥ల స్కేలు తీసుకున్న ఎస్‌జిటి ఉపాధ్యాయునికి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. ఆయన వేతన స్థిరీకరణకు ఆప్షన్ ఇచ్చుకోవాలా? ఇంకా ఆయనకు 10 సం॥ల సర్వీస్ ఉంది. 6 సం॥ల స్కేలు రాదంటున్నారు. వాస్తవమేనా?

– **బి.రత్నబాబు,** విశాఖపట్నం

**జవాబు** : 24 సం॥ల స్కేలు తీసుకున్న తదుపరి పదోన్నతి లభిస్తే ఆప్షన్ అవకాశమే లేదు. పదోన్నతి రోజున ఎఫ్ఆర్ 22ఎ(1) ప్రకారము వేతన స్థిరీకరణ చేస్తారు.
క్రింది కేడర్‌లో 24 సం॥ల స్కేలు తీసుకున్న వారికి పదోన్నతి పోస్టులో ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తించదు. కావున ఆయనకు 6 సం॥ల స్కేలు రాదు.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు పదోన్నతి నిరాకరిస్తే అప్పటివరకు తీసుకున్న 12 సం॥ స్కేలు రికవరి చేస్తారా?

– **సి.హేమలత,** నెల్లూరు

**జవాబు** : పదోన్నతి నిరాకరించడానికి ముందు వరకు తీసుకుంటున్న ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేళ్ళని రికవరీ చేయరు. తదుపరి రావలసిన స్కేళ్ళు ఇవ్వరు.

**ప్రశ్న** : నేను ఆగష్టులో ఉద్యోగ విరమణ చేయుచున్నాను. నా సేవా పుస్తకంలో గ్రూప్ ఇన్స్యూరెన్స్ మినహాయింపు నమోదులు స్లాబ్ మారినప్పుడు ఉండాలా? లేక పాఠశాల మారినప్పుడు ఉండాలా తెలియజేగలరు.

– **ఎస్.వి.ఎస్.భాస్కర్,** సత్తెనపల్లి

**జవాబు** : జీత భత్యముల నుండి మినహాయించిన గ్రూప్ ఇన్స్యూరెన్స్ వివరాలు ప్రతి ఆర్థిక సంవత్సరం సేవా పుస్తకంలో నమోదు చేయాలి. ఆచరణలో ఆ విధంగా జరగడం లేదు. కనీసం స్లాబ్ మారినప్పుడు, డిడిఓ పరిధి మారినప్పుడు తప్పనిసరిగా నమోదులు ఉండాలి.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు వేసవి సెలవుల అనంతరం పాఠశాల పున:ప్రారంభం రోజున పాఠశాలకు హాజరు కాలేదు. ఆయనకు ఏ విధమైన సెలవు మంజూరు చేయాలి? వేసవి సెలవులకు కూడా సెలవు మంజూరు చేయాలా?

– **ఎన్.శ్రీనివాసరావు,** రాయచోటి

**జవాబు** : ఆం.ప్ర. సెలవు నిబంధనలు 1933 నిబంధన 12 మరియు పాఠశాల విద్యాశాఖ కమీషనర్ గారి ఉత్తర్వులు ఎల్.డిఎస్.నం. 1983/జి3/83, తేది. 30. 03.1984 ప్రకారం వేసవి సెలవులకు సఫిక్స్ లేదా ప్రిఫిక్స్‌గా వాడు కొనవచ్చు. కావున ఆయనకు పాఠశాల పున:ప్రారంభం రోజున అర్ధజీతపు / సంపాధిత / జీత నష్టపు సెలవు మంజూరు చేయవచ్చును.

**ప్రశ్న** : ప్రసూతి సెలవులో ఉన్న ఒక ఉపాధ్యాయిని బదిలీ పొందితే నూతన పాఠశాలలో ఎప్పుడు చేరాలి? చేరి ప్రసూతి సెలవు కొనసాగించవచ్చా,?

– **బి. శ్రీదేవి,** విజయనగరం

**జవాబు** : విధులలో చేరితే ప్రసూతి సెలవు ముగిసినట్లే. కావున నూతన పాఠశాల ప్రధానోపాధ్యాయునికి/ మండల విద్యాశాఖాధికారికి ప్రసూతి సెలవు విషయం తెలియ బరుస్తూ సెలవు అనంతరం విధులలో చేరగలననే లేఖ పంపిస్తే సరిపోతుంది.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు ఆగస్టులో ఉద్యోగ విరమణ చేయుచున్నారు. సెప్టెంబర్ ఆయన ఇంక్రిమెంట్ నెల. సెప్టెంబర్ 1వ తేదీన 12సంవత్సరముల స్కేలు రావలసివుంది. రెండింటిని నోషనల్‌గా మంజూరు చేస్తూ పెన్షన్ కి లెక్కించవచ్చా?

– **బి. రేణుకయ్య,** అనంతపురం

**జవాబు** : ఉద్యోగ విరమణ మరుసటి రోజు గల వార్షిక ఇంక్రిమెంట్ మాత్రమే పెన్షన్ లెక్కింపుకు నోషనల్‌గా మంజూరు చేయవచ్చు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేళ్ళకు ఇది వర్తించదు

**ప్రశ్న** : పిల్లల ఉన్నత విద్య కొరకు తీసుకునే పిఎఫ్ ఋణం తిరిగి చెల్లించకుండా ఉండే విధంగా ఎంతవరకు మంజూరు చేస్తారు? – **బి.సీతాలక్ష్మి,** ఒంగోలు

**జవాబు** : పిల్లల చదువుకు అయ్యే ఖర్చు లేదా పిఎఫ్ ఖాతాలో నిల్వ ఉన్న సొమ్ములో 50% వరకు పార్ట్‌ఫైనల్‌గా మంజూరు చేస్తారు.

# అమరుడు



చిలుకూరి శ్రీనివాసరావు
ఐక్యఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు

ఎప్పటిలాగే ఉదయాన్నే డాబా మీద పడక కుర్చీలో కూర్చుని రిలాక్స్‌డ్‌గా న్యూస్ పేపర్ చదువుతున్నాడు సూర్య ప్రకాశరావు. టీపాయ్ మీదున్న సెల్ఫోన్ తదేకంగా మోగుతోంది. వార్తా పఠనంలో పూర్తిగా మునిగిపోయిన సూర్య ప్రకాశరావుకి ఫోన్ మీద ధ్యాసలేదు. మళ్లీ మళ్లీ మోగేసరికి "పొద్దున్నే ఎవడ్రా బాబు! ఈ ఫోను" అని నసుక్కుంటూ ఫోన్ లిఫ్ట్ చేసి హలో అన్నాడు గంభీరంగా. అవతల నుంచి ఏవో మాటలు. ఉన్నట్టుండి సూర్య ప్రకాశరావు ముఖంపై ముచ్చెమటలు. ఆకాశం బద్దలై పోతున్నట్టు, కాళ్ళ కింద భూమి కంపిస్తున్నట్లు అతను వణికిపోతున్నాడు. నోరు మూగబోయింది. బేల చూపు తప్ప కళ్ళల్లో కదలికలు లేవు. కూర్చున్న చోటే ఠపీలుమని కూలబడిపోయాడు. కాఫీ తీసుకొచ్చిన సుశీల భర్తను చూడగానే బెంబేలెత్తిపోయి కప్పు పడేసింది. మీద పడి "యావండీ! యావండీ!ఏమైందండీ!" అంటూ గావు కేకలు పెడుతోంది. ఇల్లూడుస్తున్న పనిమనిషి మంగ గబగబా వచ్చి "అయ్యగారికి ఏమైందమ్మగారూ" అంటూ తను కూడా కేకలు పెడుతూ కంగారు పడింది. నేలన పడున్న ఫోన్ నుంచి సన్నగా మాటలు వినబడటంతో తీసి చెవి దగ్గర పెట్టుకుంది మంగ. వాళ్ళు చెప్పిన మాట వినగానే ఆమెకూ 'గుండెలు గుబేలు' మన్నాయి."అయ్యో నా ఇంటోళ్ళకింత కష్టమా?!"అంటూ మంగ పెట్టే సోకన్నాలకు "ఏం జరిగిందో"ని ఇరుగుపొరుగు ఆతృతగా వచ్చారు. విషయం తెలిసి వాళ్లు కూడా దుక్కాన్ని ఆపుకోలేక పోయారు. శోకసంద్రంలో వున్న సూర్య ప్రకాషరావు దంపతులని తలో మాటతో సముదాయిస్తున్నారు. "ఈ వయసులో ఎవరికి రాకూడని కష్ట"మంటూ ఓదారుస్తున్నారు. కొందరు ఫోన్‌లో బంధువులకు సమాచారం ఇస్తుంటే. మరికొందరు ఇక జరగాల్సిన కార్యక్రమాలకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఫోన్ మోగిన క్షణాల్లోనే ఆ ప్రాంతం విషణ్ణవదనంగా మారిపోయింది.

xxx

సూర్య ప్రకాశరావు సహకార శాఖలో వివిధ కేడర్లో పనిచేసి ఇటీవలే సీఈఓగా పదవి విరమణ చేశాడు. తనది రిజర్వ్డుగా ఉండే మనస్తత్వం. ఎవరితోనైనా ముక్తసరిగా మాట్లాడతాడు. అతని వల్ల ఎవరికి అంత చెడ్డా లేదు అలాగని మంచీ లేదు. పూర్వ నుంచి ఆర్థికంగా కాస్త స్తోమత ఉన్న కుటుంబం. ప్రతి మాటలోనూ హైప్రొఫైల్ గా కనిపించాలనుకునే వ్యక్తిత్వం తనది. తన లైఫ్ స్టైల్ కూడా దర్పంగానే ఉంటుంది. అతనికి జీవితంలో ప్రతి దానికి ఒక లెక్కుంటుంది. తాను గీసుకున్న గీతని కొంచెం కూడా అతిక్రమించడు.

సుబ్బయ్యది, సూర్య ప్రకాశరావు ఇంటికెదురుగా వున్న పెంకుటిల్లు. అతను కౌలు రైతు. సూర్య ప్రకాశరావు పొలాలను తనే సాగుచేస్తాడు. సుబ్బయ్య, ప్రకాశరావు చిన్ననాటి స్నేహితులు కూడా. పొలమే కాకుండా ఇంటి పనులు కూడా చక్కబెడుతూ చేదోడుగా ఉంటాడు సుబ్బయ్య. ముక్తసరిగా మాట్లాడే సూర్య ప్రకాశరావు ఎవరితోనైనా కాస్త సుదీర్ఘంగా మాట్లాడాడంటే అతను సుబ్బయ్య మాత్రమే. ఉదయం సాయంత్రం ఇద్దరూ కాసేపైనా మాట్లాడుకోకపోతే వాళ్లకి రోజెళ్లదంటే అతిశయోక్తి కాదు. పడకుర్చీలో ప్రకాశరావు, పక్కనే చెక్కబెంచీ మీద సుబ్బయ్య కూర్చుని రోజూ వాళ్ల బాతాఖానీ సాగుతుంది. ఊళ్లో విషయాలన్నీ సుబ్బయ్య, లోక సమాచారాన్ని సూర్య ప్రకాశరావు పూసగుచ్చినట్టు మాట్లాడుకుంటారు. సూర్య ప్రకాశరావు రిటైర్ అయిన తర్వాత వీళ్ళ కబుర్ల కచేరి మరీ ఎక్కువైంది. ఏ అవసరం ఉన్న వాళ్ల మేడమీంచి సూర్య ప్రకాశరావు పిలవడం, "అయ్యా" అంటూ సుబ్బయ్య వచ్చి వాలిపోవడం జరిగిపోద్ది. వీరిద్దరికీ ఒకే యీడు మగపిల్లలు ఉండటం మరో కాకతాళీయం. సూర్య ప్రకాశరావు తన కొడుకు అక్షయ్‌ను పట్నంలో ఒక పేరు మోసిన కాన్వెంట్లో చేర్పించాడు. కొన్నాళ్ళకి సుబ్బయ్య కొడుకు వందనం కూడా ఊళ్లో ప్రభుత్వ బళ్ళో చేరాడు. "డబ్బులు నేను సర్దుతానులే! మీ వాణ్ని కూడా మా అక్షయ్‌తోపాటు కాన్వెంట్‌కి పంపించేద్దాం! గొప్పోళ్ళ పిల్లలంతా అక్కడే చదువుతారా"ని సూర్య ప్రకాశరావు చాలాసార్లు సుబ్బయ్య పై ఒత్తిడి తీసుకొచ్చాడు. ఎప్పుడూ సూర్య ప్రకాశరావు మాటలు తూచా తప్పకుండా పాటించే సుబ్బయ్య ఈ విషయంలో మాత్రం ఎప్పటికప్పుడు "తన స్తోమత అంత కాదంటూ" సున్నితంగానే తిరస్కరించేవాడు. "మావోణ్ని ఊరి బళ్ళోనే చదివిస్తాను బాబూ! చదివినంత మట్టుకి చదువుతాడు. ఎప్పుడు చదవబ్బకపోతే అప్పుడే నాతో పొలం తీసుకుపోతాను. మీలాంటి రైతు దగ్గర ఇంకో రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకుంటే! మాకు సరిపోద్ది! సుకంగా రోజెళ్ళిపోద్ది" అనేసేవాడు సుబ్బయ్య. పైకి అనకపోయినా సూర్య ప్రకాశరావు"మీ తలరాత ఇంతే! నేనేం చేస్తాను?" అనుకునేవాడు మనసులో!

xxx

కష్టాలను ఓర్చుకోవటం, నష్టాల్ని భరించడం, అందరితో కలుపుగోరుతనంగా మసలడం, ఎవరికైనా చేతనైనంత పని సాయం చేయడం సుబ్బయ్య వ్యక్తిత్వం. అచ్చంగా తన లక్షణాలే పుణికి పుచ్చుకున్నాడు వందనం. సెలవు రోజుల్లో పొలం వెళ్లి తండ్రికి అసరాగా నిలుస్తున్నాడు. అతని నడవడికి, చదివే తీరుకి బళ్ళో ఉపాధ్యాయులు కూడా ముచ్చటపడి వందనాన్ని దగ్గరకు చేరదీసు కున్నారు. తన చేత 'నేషనల్ సైనిక్ స్కూల్ ఎంట్రన్స్' పరీక్షలు రాయించారు. టీచర్లు అనుకున్నట్టుగానే వందనం పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకొని కోరుకొండ సైనిక్ పాఠశాలలో సీటు సంపాదిం చాడు. ఆ పాఠశాల గొప్పతనం గురించి ఉపాధ్యాయులు సుబ్బయ్యకు చెబితే అతను తెగ సంబరపడిపోయాడు. పుత్రోత్సాహంతో ఊరంతా

ఆనందాన్ని పంచుకున్నాడు. ఈ సంతోషాన్ని సూర్య ప్రకాశరావుకి కూడా చెప్పాలని ఆయన ఇంటికి వెళ్లాడు. సూర్య ప్రకాశరావు చాలా మురిసిపోతాడని ఊహించాడు. సుబ్బయ్య మాటలు విన్న సూర్య ప్రకాశరావు ముఖంలో అంతగా స్పందనలు కనిపించలేదు. విషయాన్ని తెలుసుకుని కూడా విని కూడా గుమ్మనంగానే ఉన్నాడు. ముఖాన్ని పేపర్‌లోనే ఉంచి తీరిగ్గా మాట్లాడుతూ "ఒగ్గానొక కొడుకు, వాడికెందుకు సైనిక్ పాఠశాల? భవిష్యత్తు ఆలోచించాలి కదా!. రేపొద్దున్న జరక్కూడంది ఏదైనా జరిగితే నీకు దిక్కెవరు? పోనీ ఇద్దరు ముగ్గురు బిడ్డలు ఉంటే అలాగే అనుకోవచ్చు. దేశానికి అప్పగించడం కోసమా? పిల్లల్ని కనేది? నాకైతే ఏమీ నచ్చలేదు తర్వాత నీ ఇష్టం"అని ముభావంగా అనేసరికి సుబ్బయ్య నిర్ఘాంత పోయాడు. కాసేపటికి తేరుకొని "నాకేం తెలుసు బాబూ! ఆడి బళ్ళో మేష్టార్లు ఇది చాలా గొప్ప చదువు, ఎవరికో గాని ఇలాంటి అవకాశం రాదు. మీ వాడు కష్టపడి చదివాడు గనుక వచ్చిందం టున్నారు. మా వాడు కూడా అదే చదవడానికి ఇష్టపడుతున్నాడు. ఇక నేనేం చేయగలను?. ఆడి బతుకు ఆడిష్టం" అన్నాడు. సూర్య ప్రకాశరావు ఇక మరో మాట మాట్లాడకుండా తన గంభీర మౌనాన్నే పాటిస్తున్నాడు.

×××

దిగాలుగా ఇంటికెళ్లిన సుబ్బయ్య వాలకం చూసి భార్య వేణమ్మ "ఏమైందలా వున్నార"నడిగింది."ఏమీ లేదు వేణు!

మనోణ్ని సైనిక స్కూల్లో చేర్పించడం మంచిది కాదంటున్నారు బ్యాంకు అయ్యగారు. మనోడు అక్కడ చేరటం ఆయనకి అస్సలు నచ్చలేదు. ఆయన మన బాగుబోగులు కోరే వ్యక్తి. మనం తప్పు చేస్తున్నామా? నాకేం అర్థం కావట్లేద"ని భార్యతో చెబుతూ అంతర్మథన పడుతున్నాడు సుబ్బయ్య. "అదేం లేదు లెండి! మనమంటే సార్ కి ఇష్టమే! కాకపోతే సైనిక బళ్లో చదివి, తర్వాత సైన్యంలో ఉద్యోగం చేయటం రిస్క్ ని ఆయనకి ఇష్టం లేదు. ఆయన డబ్బులున్నోడు కనుక వాళ్ళబ్బాయిని తన హోదాకి తగ్గట్టు పెద్ద చదువు చదివించి విదేశాలకి పంపుతారు. మనలాంటోళ్ళకి అది సాగుతుందా ఏంటి!?

'పిండి కొద్ది రోట్టె'మన తాహత కొద్ది మన బతుకు. మనోడికి ఈ చదివే మనకి చాలా గొప్ప. మన కుటుంబంలో ఇప్పటివరకు ఎవరైనా ఉద్యోగస్తులు ఉన్నారా ఏంటి?

స్కూల్లో టీచరమ్మలు చెప్పలేదా? ఈ చదువు ఎంత గొప్పదో? నువ్వు మాత్రం ఆయన మాటలు ఏవీ మనసులోకి తీసుకోకు"అనేసి భర్తని కాస్త స్థిమ్మితపరిచింది వేణమ్మ. కొడుకు పట్నంలో పేరు మోసిన కాలేజీలో కంప్యూటర్ చదువుతున్నాడని సూర్య ప్రకాశరావు ఎప్పుడూ గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. "స్టడీ పూర్తయిన తర్వాత మావాడు ఫారెన్‌లో ఉద్యోగం చేస్తాడని"డాబుగా చెప్పి తెగ మురిసిపోతుంటాడు.

తన కొడుకు చదువుతున్న కాలేజీలో ఫలానా సెలబ్రెటీస్ పిల్లలు చదువుతున్నారని చెప్పడమే పనిగా పెట్టుకున్నాడు.

×××

వందనం సైనిక్ స్కూల్లో చదువు పూర్తి చేసి, శిక్షణ కూడా ముగించుకుని సైనికదళ ఉద్యోగంలో చేరడం అంతా చకచకా జరిగిపోయింది. ఆరు నెలలు ఉద్యోగం మరో ఆర్నెల్లు సెలవలు ఇదీ వందనం డ్యూటీ. అతని పనితీరు చురుకుదనం అధికారుల్ని బాగా మెప్పించింది. వందనానికి వెంటవెంటనే ప్రమోషన్లు వచ్చాయి. పెళ్లి కూడా జరిగింది. భార్య సృజన. తను చదువుతోపాటు ఆదర్శ భావాలున్న అమ్మాయి. తను అత్తమామలతో బాగా కలిసిపోవడం ఆ ఇల్లు ఆనందాలకు చిరునామాగా మారింది. అక్షయ్ కూడా తండ్రి అనుకున్నట్టే చదువు పూర్తి చేసి విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. బాగా ఆస్తులు గడించిన చిదానందం కుమార్తె సురేఖతో అక్షయ్ పెండ్లి జరిగింది. స్థాయికి మించి చాలా ఆడంబరంగా వివాహాన్ని జరిపించాడు సూర్యప్రకాశరావు. పెళ్లి ఊరంతా మారుమోగిపోయింది.

×××

అంతా సజావుగా నడుస్తోందన్న తరుణంలో హఠాత్పరిణామం. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతంలో భారత సైన్యంపై ముష్కర దాడులు. దుర్ఘటనలో 20 మంది భారత సైన్యం తోబాటు అధికారులు చనిపోయారు. దురదృష్టం ఏంటంటే మృతుల్లో వందనం కూడా ఉన్నాడు. ఒక సైనిక అధికారి ఈ విషయం ధృవపరుస్తూ సుబ్బయ్య కుటుంబ సభ్యులకు సమాచారం. తమ ఆశాదీపం ఆరిపోయిందన్న వార్త ఆ కుటుంబాన్ని అనంత దుఃఖ సాగరం చేసింది. అంతవరకు సరదా సాగిన ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదమనే తుఫాన్ విలయతాండం చేస్తోంది. భార్య సృజన, తల్లిదండ్రుల రోదనలు మిన్నంటుతున్నాయి.

కన్నీరు మున్నీరవుతున్న అత్తమామలను సృజన గుండెలకత్తుకొని, "మనకికక దిక్కెవర"ని ఏడుస్తూ ఉంటే అక్కడవాళ్లు కంటతడిని తప్పించుకోని పరిస్థితి. కార్యక్రమాలన్నీ దగ్గరుండి జరిపించి వాళ్ల ఆలనా పాలనా ఎంతో బాగా చూసుకున్నాడు సూర్య ప్రకాశరావు. దీర్ఘ దృష్టిస్తున్న సృజన ముందుగా తేరుకొని, అత్తమామలను ఓదారుస్తోంది. వాళ్లని బిడ్డలా చూసుకుంటోంది. బాధ దిగమింగాక దైనందిన బాట పట్టాడు సుబ్బయ్య. ఓ రోజు సూర్య ప్రకాశరావుతో కలిసి మాట్లాడుతూ కొడుకు గుర్తొచ్చి కన్నీటి పర్యంతమయ్యాడు. సుబ్బయ్యని ఓదారుస్తూనే "ఇలాంటిదేదో జరుగుద్దని నేను మొదట్నించి మొరపెట్టు కుంటున్నాను. మీరే నా మాట పెడచెవిన పెట్టారు. ఇవాళ మా వాడిని చూడండి విదేశాల్లో హాయిగా ఉద్యోగం చేస్తున్నాడు. నాకు ఎలాంటి బెంగా లేదు. దేనికైనా ముందు చూపుండాలి. మనకు అర్థం కాకపోతే నాలాంటి వాళ్ళు చెప్పిన మాటైనా వినాలి. ఇవాళ మీ బాధని ఎవరు తీర్చగలరు?"అని చురకేసినటట్టు మాట్లాడాడు సూర్య ప్రకాశరావు. అసలే బాధలో ఉన్న సుబ్బయ్యకి ఆ మాటలు 'గోరి చుట్టు మీద రోకలి పోటులానిపించాయి' సుబ్బయ్యకి మౌనం తప్ప ఇకమాట్లారాలేదు. సుబ్బయ్య ఇంటికి వెళ్ళేసరికి ఒక పోస్ట్ వచ్చింది. కారుణ్య నియామకం కింద సృజనకి ఆ ఊరి బ్యాంకులో ప్రభుత్వం క్లరికల్ ఉద్యోగం అపాయింట్మెంట్ ఆర్డర్,వందనం ఉద్యోగనిమిత్తం రావలసిన ఆర్థిక బెనిఫిట్స్ తాలూకు అందులో ఉన్నాయి. "తిరిగిరాని

లోకాలకి వెళ్లిపోయి కూడా కుటుంబానికి ఇంత మేలు చేస్తున్నావా? కొడుకా!" అంటూ తల్లిదండ్రులు దు:ఖ్కావేదన చెందారు. తల్లిదండ్రులు లేక బంధువులింట అనాధగా పెరిగిన సృజనకి బతుకు తీపి తెలుసు. అందుకే ఆమె ఉద్యోగం చేస్తూ అత్తమామలతో కలివిడిగా మెలుగుతూ వారి ముఖాల్లో పూర్వపు నవ్వులు నింపడానికి, ఆ ఇంటి నుండి విషాదాన్ని పారదోలడానికి అలుపెరుగని కృషి చేస్తోంది.

×××

విదేశాల నుంచి వస్తున్న అక్షయ్ హైదరాబాదు ఎయిర్పోర్టులో దిగాడు. చాలా కాలం తర్వాత కలిసిన వాళ్ల పాత మిత్రులు అక్కడే పార్టీకి ప్లాన్ చేసుకున్నారు. రాత్రంతా ఆనందంగా గడిపారు. ఉదయాన్నే అక్షయ్ని రైల్వే స్టేషన్కి దించడానికి బయలుదేరారు. వాళ్ల మాటల హుషారుతో కారు వేగం పెరుగుతోంది. మరో ఫర్లాంగ్ దూరంలో స్టేషన్కి చేరిపోతారు. అకస్మాత్తుగా ఒక కుదుపు, భారీ శబ్దం. కారు డివైడర్ను ఢీకొట్టి బోల్తా పడింది. ఎదరున్న ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. వెనుకున్న ముగ్గురూ గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ఆ సమయంలో కారు నడుపుతున్నది అక్షయ్. పొద్దున్నే పేపర్ చదువుకుంటున్న సూర్య ప్రకాశరావుకి మోగిన ఫోన్ కాల్ ఇదే. కొడుకు మీదే కోటి ఆశలు పెట్టుకుని బతుకుతున్న సూర్య ప్రకాశరావు వాస్తవాన్ని జీర్ణించుకోలేక ఖంగు తిని స్పృహ కోల్పోయాడు . కాసేపటికి నెమ్మదిగా తెలివిలోకొచ్చాడు. పోస్టుమార్టమ్ పూర్తయి అక్షయ్ పార్థివ దేహం ఇంటికొచ్చింది. అంబులెన్స్ నుంచి ఆ భౌతిక కాయాన్ని దింపుతూ ఉంటే..."ఫారిన్ నుంచి వస్తావంటే! పాడె కట్టుకుని వచ్చావా బాబూ"అంటూ ఆ తల్లిదండ్రులు ఏడ్పుకి అక్కడ చమర్చని కళ్ళు లేవు.

వాళ్లని సముదాయించడం అక్కడ ఎవరి తరమూ కావట్లేదు. సుబ్బయ్యను పట్టుకుని బోరున విలపిస్తున్నాడు సూర్య ప్రకాశరావు. కొడుకు మరణ వార్త ఒక బాధైతే. నిండు చూలాలైన సురేఖకి ఈ వాస్తవాన్ని ఎలా చెప్పాలనేదే వాళ్ళ తపన. కోడలు ఇప్పుడు తొమ్మిదో నెల గర్భిణీ. పురిటి కోసం కాంద్రేగుల వాళ్ళ పుట్టింటికెళ్ళింది.

×××

కాలం గడుస్తోంది. బోలెడన్ని ఆశలు పెట్టుకున్న అక్షయ్ జ్ఞాపకాలు మాత్రం సూర్య ప్రకాషశరావు దంపతులను వెంటాడు తూనే ఉన్నాయి. కొడుకు లేడన్న బెంగ వాళ్ళని రోజురోజుకీ కుదేలు చేసేస్తోంది. సురేఖకి కొడుకు పుట్టాడు. "అక్షయే మనవడు రూపంలో వచ్చాడేమో?"నని వాళ్లు సంబరపడ్డారు. కొడుకుని మనవడిలో చూసుకుందామని ఎంతో ఆశపడ్డారు. కానీ అది అడియాసే అయ్యింది. సురేఖ "ఇక అత్తవారింట ససేమిరా కాలుమోపనని" కరాఖండిగా చెప్పేసింది. ఆమెకు అత్తమామల పొడకూడా గిట్టలేదు. సురేఖకి అత్తారికి మధ్య దూరం బాగా పెరిగింది. చిన్నా పెద్దా సమస్యలు కూడా తలెత్తాయి. పోలీస్ స్టేషన్లో తగవులు వరకు విషయం వెళ్ళింది. సూర్య ప్రకాశరావుకి వియ్యంకుడు చిదానం దానికి మధ్య మాటలు వాగ్యుద్ధం మొదలయ్యింది. "నీకు పిల్లలు పెంచే పద్ధతి చేతకాలేదు. అందుకే మీ అబ్బాయి ఫ్రెండ్స్తో తాగి తందనాలడుతూ, యాక్సిడెంటయ్యాడు. వాడికే పోయినోడు బానే ఉన్నాడు. ఇక్కడ నువ్వూ బానే ఉన్నావ్. ఎటోచ్చి మా అమ్మాయే, పిల్లోడితో దిక్కుమాలినదై పోయింది" అనేశాడు చిదానందం. అంతటితో ఆక్కుండా "ఈ దిక్కుమాలిన సంబంధంతో మా బతుకులు ఇలా తగులడ్డాయి." అని మరో కొసరేశాడు. దానికి చిర్రెత్తిపోయి "మీ అమ్మాయిని చేసుకున్నాకే మా అబ్బాయి పరిస్థితి ఇలాగైందం" టూ సూర్య ప్రకాశరావు కేకలుపెట్టాడు. మాటలతో ఆగని వ్యవహారం కోర్టు వరకూ వెళ్ళింది.తన భర్తకు రావల్సిన ఆస్తి ఇవ్వాలంటూ సురేఖ దావావేసింది. వాళ్లు పరపతి గల కుటుంబం కావడంతో పెద్ద లాయర్లను పెట్టుకొని కేసులు బలంగా బిగించారు. సూర్య ప్రకాశరావు,సుశీల ఇద్దరూ మానసికంగా కృంగిపోతున్నారు. "ఈ వయసులో పోలీస్ స్టేషన్లు,కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింద"ని లోలోపల కుమిలిపోతున్నారు. పైపెచ్చు "నీకు పెంపకం రాలేదని, మీ సంబంధం మంచిది కాద"న్న చిదానందం వేసిన చురకలు పదేపదే గుర్తొచ్చి సూర్య ప్రకాశరావుకి గుండెల్లో ఈటెల్లా గుచ్చుకుంటున్నాయి. తన పెంపకమే కరెక్టు, తన ఆలోచనలే కరెక్టు అని దాబుగా ఊహల్లో బతుకుతున్న సూర్య ప్రకాశరావు మనసుకి వరుసగా తగులుతున్న దెబ్బలు క్షణం క్షణం కంగుతిన్నట్లనిపిస్తోంది.

×××

యుద్ధంలో వీరత్వం చూపి అమరత్వం పొందిన వందనానికి కేంద్ర ప్రభుత్వం రివార్డు ప్రకటించింది. అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా ఐదు లక్షల రూపాయల నగదు, అవార్డు ఢిల్లీలో రాష్ట్రపతి చేతులు మీదుగా వేలాదిమంది కరతాళ ధ్వనుల మధ్య కోడలు అందుకుంటుంటే... అక్కడే ప్రత్యక్షంగా తిలకిస్తున్న అత్తమామలు పులకించి పోయారు. కొడుకు వీరమరణానికి ఉప్పొంగిపోయారు. పత్రికల్లో, వార్త మాధ్యమాల్లో ప్రత్యేక శీర్షికలై ఈ విషయం ఊరు వాడ మారుమోగుతోంది. అవార్డు తీసుకుని సొంతూరికి చేరిన సుబ్బయ్య కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ స్వయంగా స్వాగతం పలికారు. గ్రామంతా ఊరేగింపు జరిగింది. తల్లిదండ్రులకు, కోడలు సృజనకు వీధి వీధినా సన్మానాలు, సత్కారా లు జరుపుతున్నారు గ్రామస్తులు. వందనం దేశభక్తిని కొనియాడుతూ ఊరి మొదట్లో వందనం నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్టించి 'దాని కింద మా ఊరి కీర్తి కిరీట'మని రాశారు.

×××

కొడుకు లేనితనాన్ని,కోడలి తగువుని గుర్తుతెచ్చుకుని బాధ పడుతున్న సూర్యప్రకాశరావుని"మనిద్దరికీ ఎందుకయ్యా? భగ వంతుడు ఈ వయసులో ఈ పుత్ర శాపం పెట్టాడని" సుబ్బయ్య ఓదారుస్తున్నాడు.పడకుర్చీలో జారబడి కూర్చున్న సూర్య ప్రకాశరావు కాస్త పైకి లేచికూర్చుని పక్కవైపు వంగి సుబ్బయ్యని హృదయానికి హత్తుకున్నాడు. "సుబ్బయ్యా! నా కొడుకుది మరణం. కానీ నీ కొడుకుది అమరం. ఈ జన హృదయాల్లో అజామరం. "అంటూ భుజం తట్టాడు.

# యుద్ధాలు శవాలను, శకలాలను మిగులుస్తాయి

# ప్రతీకారాన్ని తీర్చవు




ఏప్రిల్ 22, 2025న జమ్మూ కాశ్మీర్లో పహల్గాం ఉగ్రవాదుల దాడిలో 26 మంది అమాయక పౌరులు మరణించారు. ఈ ఘటన తర్వాత, భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి, 90 మంది ఉగ్రవాదులను హతమార్చింది.

ఉగ్రవాదుల దాడి, ఆపరేషన్ సిందూర్ రెండూ సామాన్య ప్రజానీకం ముందు అనేక ప్రశ్నలు, ఆలోచనలు లేవనెత్తాయి.

**మొదటిది:**

ఒక సాధారణ కశ్మీరీ 20 మైళ్ల ప్రయాణం చేయాలంటే 5, 6 చెక్ పోస్టులు దగ్గర స్కాన్ చేయించుకోవాలి. ప్రతి ఏడుగురు కశ్మీరీలకు ఒక యూనిఫార్మ్ మనిషి కాపలా ఉంటాడక్కడ. కశ్మీర్ నడిగడ్డలో చిక్కటి అడవి కూడా లేని చోట అంతమంది సాయుధ వ్యక్తులు ఎలావచ్చి ఉంటారు? పహల్గావ్‌లోని బైసరాన్ మైదానంలో సెక్యూరిటీ ఎందుకు లేదు? కాల్పుల తర్వాత నింపాదిగా నడుచుకుంటూ వెళ్ళిన ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేక పోయారు? భారత గూఢచారవ్యవస్థ అంత లోపభూయిష్టంగా ఉందా?

**రెండవది:**

ఉగ్రవాదులు టూరిస్టులలో ఓ మతస్తులనే టార్గెట్ చేసుకొని చంపారని వాదన. కానీ చనిపోయిన వారిలో ఇద్దరు ముస్లింలు ఉన్నారని అధికారిక జాబితాలే చెబుతున్నాయి. పైగా దాడిలో బాధితులకు స్థానిక ముస్లిం యువకులు ప్రాణాలకు తెగించి సహాయపడ్డారని బాధిత మహిళలే చెబుతున్నారు.

అలాంటి సందర్భంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో మతం పేరుతో దాడులు చేయడం, ప్రజలను రెచ్చగొట్టడం ఏవిధంగా సమంజసం? ఇది ఉగ్రవాదుల లక్ష్యం. వీరి లక్ష్యం అక్కడే కదా!

**మూడవది:**

ఉగ్రవాదుల వలలో చిక్కుకుని విలువైన జీవితాలను, అందమైన భవిష్యత్తును కోల్పోతున్నది కాశ్మీర్ యువత. మళ్ళీ బ్రతుకుతెరువు కోసం సాధారణ పేదకుటుంబాల నుంచి మరో ఉపాధి కరువై సైన్యంలోకి ప్రవేశించిన యువకులు. ఈ రెండు సందర్భాలలోనూ ఆ కుటుంబాలలో మహిళలు తీవ్రాతి తీవ్రమైన బాధితులు. చేతికందొచ్చిన కొడుకులను, యవ్వన ప్రాయంలో భర్తలను కోల్పోయిన మహిళలు బ్రతికున్న శవాల్లా దీనంగా బతుకీడ్చడం ఎన్ని కుటుంబాల్లో కనబడుతుందో!

**నాల్గవది:**

భారత అంతరంగ విషయాల్లో కానీ, భారత్, పాకిస్తాన్ల ద్వపక్ష విధానాల్లో జోక్యానికి మొట్టమొదటిసారి అమెరికాను ఆహ్వానించింది ఎవరు? ఇది భారతదేశ చరిత్రలో ఎప్పుడు జరగలేదు.

**చివరిది:** జమ్మూ కశ్మీర్లో ఇక టెర్రరిస్టు చర్యలు జరగవని భారతప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందా?

## గుర్గావ్ నుంచి కొచ్చి వరకూ అందరిదీ ఒకే విషాదం

పహల్గావ్ బాధిత మహిళలు కొండంత బాధను గుండెల్లో దాచుకొని ఎంతో సంయమనంతో వ్యవహరించారు. కొన్ని స్పష్టమైన ప్రశ్నలను ముందుకు తెచ్చారు. వాళ్లు గతంలో ఒకరికొకరు తెలియదు. వేరు వేరు ప్రాంతాలకు, వేర్వేరు నేపథ్యాలకు చెందిన వాళ్లు, పహల్గావ్‌లో వారికి జరిగిన భయంకర విషాదంలో అనుకోకుండా ఒకే రకమైన విషాదానికి గురయ్యారు. ఒకే విషయం మీద వాళు విడివిడిగా మాట్లాడినా ఒకే రకమైన ఆవేదనను, ఆక్రోశాన్ని వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అబద్ధపు వాదనలను, అక్కడి భద్రతారాహిత్యాన్ని ఈ శోకతప్త మహిళా టూరిస్టులు సూటిగా ప్రశ్నించారు. ద్వేషాన్ని, వక్రీకరణలు అల్లుతున్న మతోన్మాద, కశ్మీర్ వ్యతిరేక కథనాలకు భిన్నంగా, అనేక చేదు నిజాలను ఆ మహిళలు ప్రకటించారు. భద్రతా లోపాన్ని ఎత్తి చూపడమే కాక, స్థానిక ముస్లిం ప్రజలు తమకు అండగా నిలబడిన విషయాన్ని వారు తెలియ జేశారు. సూరత్‌కు చెందిన భారతీయ స్టేట్ బ్యాంకు మేనేజరు భార్య 'శీతల్ కల్తీయ', తన భర్త అంత్యక్రియలకు వచ్చిన కేంద్ర జలశక్తి మంత్రిని 'ఎలాంటి ప్రభుత్వం మనది? మనం కశ్మీర్ను అప్రదిష్టపాలు చేస్తున్నాం. కానీ కాశ్మీర్‌లో ఎలాంటి సమస్య లేదు. సమస్యంతా ప్రభుత్వ భద్రతా ఏర్పాట్లలోనే ఉంది' అంటూ ప్రశ్నించారు (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 25 ఏప్రిల్ 2025) ఒక్క సైనికుడు కూడా అక్కడ లేకపోవటం, ఎలాంటి వైద్య సదుపాయాలు ఆ టూరిస్టు ప్రాంతంలో లేకపోవడం గురించి ఆమె ఎత్తి చూపింది. 'వీఐపీల రక్షణ కోసం వాహన సముదాయాలుంటాయి. పన్నులు కట్టే సామాన్యుల జీవితాలకు విలువ లేదా?' అని ప్రశ్నించారు.

ఎల్ఐసి రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న భర్త సుశీల్ నత్యాల్‌ను కోల్పోయిన ఇండోర్‌కు చెందిన 'జెన్నిఫర్' అక్కడ ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలు కూడా లేకపోవటం గురించి గట్టిగా అడిగారు. ఆమె భర్తను ఛాతిలో కాల్చినప్పుడు రక్తం ఎక్కువ కారి ఆయన మరణించారు. సకాలంలో వైద్యం అందితే ఆయన బతికేవారు. 'రెండు గంటల పాటు నేను సహాయం కోసం అరుస్తూనే ఉన్నాన'ని చెప్పారామె. (2025, ఏప్రిల్ 25, హిందుస్థాన్ టైమ్స్)

హర్యానా నేవల్ అధికారి భార్య, కొత్తగా పెళ్లైన హిమాన్షి చాలా స్పష్టంగా చెప్పింది. 'ముస్లిమ్స్, కశ్మీరీల మీద పడటం కాదు మాకు. కావాల్సింది. మాకు న్యాయం కావాలి. అయితే ఎవరు ఈ పని చేసారో వాళ్లనే శిక్షించాలి' అన్నదామె (మే 2, 2025 ఇండియన్ ఎక్స్ (ప్రెస్)

కేరళకు చెందిన రామచంద్రన్ గారి కూతురు ఆరతి, కర్ణాటక మంజునాథ్ గారి భార్య పల్లవి లాంటి మహిళలు చాలామంది ఇలాగే మాట్లాడారు.

## యుద్ధాల ప్రభావం మహిళలు, చిన్నపిల్లల పైన మరింత తీవ్రం

యుద్ధం ఏదైనా మానవాళికి అత్యంత నష్టాన్ని మిగిలిస్తుంది. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పర్యావరణ నష్టం, ఆర్థిక నష్టం... ఒకటేమిటి, అనేక రకాల నష్టాలు, అయిన వాళ్ళనూ, ఆత్మీయుల నూ కోల్పోవడం, పుట్టిపెరిగిన ప్రాంతాన్ని వదిలి దూరంగా వెళ్ళాల్సి రావడం, గాయాల పాలై, అనారోగ్యాల పాలై దీర్ఘకాలం శారీరకంగా, మానసికంగా కుంగిపోవడం... ఎన్నెన్నో!

యుద్ధాల్లోనే కాక ఇతర ఘర్షణల సమయంలో మహిళలు మరింత తీవ్రంగా బాధితులవుతారు.. వారిపై శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావం ఉంటుంది. యుద్ధాల వల్ల అనేక మంది స్త్రీలు శారీరక, లైంగిక హింసకు గురవుతారు. అదికాక తమ కుటుంబ సభ్యులను యుద్ధోన్ముఖులను చేయాలనే బాధ్యత మహిళలపై పెట్టడం అదనపు కష్టం.

యుద్ధం లేదా ఇతర హింసాత్మక సంఘర్షణలు ఉన్న దేశాలలో 473 మిలియన్ల మంది పిల్లలు నివసిస్తున్నారని అంచనా. తరచుగా భద్రత కోసం తమ ఇళ్లను వదిలి పారిపోవాల్సి వస్తుంది. చాలా మంది ఎక్కువ కాలం పాటు ఇళ్ళ నుంచి దూరంగా ఉండాల్సి వస్తోంది. అనేక మంది అనాథలయిపోతున్నారు. ల్యాండ్ మైన్లు, యుద్ధం యొక్క పేలుడు పదార్థాల అవశేషాల వల్ల మరణించిన మొత్తం పౌరులలో సగానికి పైగా పిల్లలే. 2010 నుండి పిల్లలపై దాడులు మూడు రెట్లు పెరిగినట్లు. ధృవీకరించబడినది.

గాజా, హైతీ, సూడాన్, సిరియా, ఉక్రెయిన్, యెమెన్ వంటి ప్రదేశాలలో యుద్ధాల వల్ల పిల్లలు తీవ్రంగా గాయపడటం లేదా చనిపోవడం జరుగుతున్నదని యునిసెఫ్ పేర్కొన్నది. ఇజ్రాయెల్-గాజా యుద్ధంలో 2023-24; 53,600కు పైగా పిల్లలు మరణించారని ఐరాస నివేదికలు సూచిస్తున్నాయి. అత్యవసర పరిస్థితులు, సాయుధ పోరాటాల సమయంలో పిల్లలు చైల్డ్ అబ్యూజ్, దోపిడీ, అక్రమ రవాణాకు. గురవుతారు, పిల్లలపై హింస, పెరిగేకొద్దీ హత్యలు, వికలాంగులను చేయడం, లైంగిక హింస, అపహరణలు మరియు పిల్లల సాయుధ నియామకం లేదా పాఠశాలలు మరియు ఆసుపత్రులపై దాడులకు పాల్పడుతుంటారు.

### మహిళల పట్ల పురుషాధిక్య సమాజపు దృష్టిని బట్టబయలు చేసిన పహల్గాం.. దాడి, ఆపరేషన్ సిందూర్

మహిళల సిందూరాన్ని తొలగించడం పితృస్వామ్య ఆధిపత్య ధోరణి. ఈ పేరుతో దాడి చేయడం మహిళలను అవమానపర్చడమే. పహల్గావ్ దాడిలోనూ, ఆపరేషన్ సిందూర్ సందర్భంలోనూ మహిళలు తీవ్రమైన వేధింపులకు గురయ్యారు. వాస్తవాలను ప్రకటించిన బాధిత మహిళలను, ప్రశ్నించిన మహిళలను దారుణంగా సామాజిక మాధ్యమాలలో ట్రోల్ చేశారు అధికార పక్ష అనుచర గణం. కేరళకు చెందిన రామచంద్రన్ కూతురు ఆర్తిమీనన్ తనకు తండ్రి పోయిన దుఃఖంలో ఇద్దరు సోదరులు దొరికారంటూ ఉద్వేగ పడ్డారు. భర్తను కోల్పోయిన హిమాన్షి నర్వాల్ ఉగ్రవాదులను శిక్షించాలి. కానీ మత విద్వేషాలు రగిలించకుండా సంయమనం పాటించాలి. ఎంతో గొప్ప మనసుతో మాట్లాడితే వారిద్దరినీ బూతులతో చెండాడారు సామాజిక మాధ్యమాలలో. స్థానిక కాశ్మీరీ ముస్లింల నుండి వారికి వచ్చిన సహాయం గురించి బాధిత మహిళలు చెబితే వారిని సామాజిక మాధ్యమాల్లో అసహ్యకరమైన పదజాలంతో వేధించారు. యుద్ధ విరమణ ప్రకటన చేసిన భారత విదేశాంగ కార్యదర్శి వివేక్ మిశ్రీ కుమార్తె ఫోన్ నంబరు సంపాదించి తీవ్రంగా దూషించారు. ఆపరేషన్ సిందూర్‌కు నాయకత్వం వహించిన కల్నల్‌సోఫియా ఖురేషీని సైతం ఉగ్రవాదుల సోదరిగా వ్యాఖ్యా నించడం ద్వారా తమ నైజాన్ని బయట పెట్టుకున్నారు. మధ్యప్రదేశ్ బిజెపి మంత్రి విజయ్. ఉగ్రవాదులతో పోరాడి భారత పౌరుషాన్ని చూపలేదంటూ మరో నాయకుడు బాధిత మహిళలను మరింత బాధకు గురిచేశాడు. ఈ సందర్భంలో సంయమనం పాటించాలంటూ, సమస్యను విశ్లేషిస్తూ వాస్తవాలు వివరించిన మహిళా జర్నలిస్టులను, మేధావులను వేధించిన తీరు దారుణాతి దారుణం.

### మతం పేరిట విద్వేషాలు

చాలామంది బాధితులతో పాటు, సాక్షాత్తూ ఒక బిజెపి నాయకుడే స్పష్టంగా ప్రకటించినప్పటికీ, ఉత్తర ప్రదేశ్‌లో, రాజస్థాన్‌లో, ఇతర ప్రాంతాలలో ఒక సమూహానికి చెందిన దుకాణాలమీద, ఇళ్ల మీద దాడి చేసి, భయభ్రాంతులను చేశారు. ముస్సోరీ లాంటి చోట్ల ఎక్కడెక్కడి నుండో వచ్చి జీవనోపాధి పొందుతున్న ముస్లిం వ్యాపారు లపై దాడిచేసి, తరిమేశారు. దేశమంతా చిన్నచిన్న ప్రాంతాల్లో సైతం కొన్ని సమూహాలపై విచక్షణారహితంగా దాడులు చేయడంతో పాటు, అభద్రతా వాతా వరణాన్ని సృష్టించారు. దాడిచేసిన ఉగ్రవాదులు ముస్లింలు కావచ్చు, కానీ అక్కడ బాధితులను ప్రాణాలకు తెగించి కాపాడింది కూడా ముస్లింలే. పదేళ్ళ బాబును భుజాలపై మోస్తూ కిలోమీటర్ల దూరం రక్తమోడిన శరీరంతో పరిగెత్తుతూ కాపాడాడు హసన్ అనే యువకుడు. సమీర్, ముసాఫిర్ అనే ముస్లిం యువకులు తమకు సహాయం చేశారని ఆరతి మీనన్ చెప్పారు. అంతెందుకు, ఆపరేషన్ సిందూర్ గురించి వివరించిన కల్నల్ సోఫియా ఖురేషి ఒక ముస్లిం మహిళ. ఒక మతాన్ని టార్గెట్ చేయడం ద్వారా దేశంలో శాంతిభద్రతలు దూరం చేయడం ఏ మతం వారికీ క్షేమం కాదు.

"మేము జమ్మూ కశ్మీర్ ప్రజలం ఈ యుద్ధంలో భాగస్వాములుగా లేము. ఇండియా పాకిస్తాన్ల మధ్య జరుగుతున్న ఈ రక్తసిక్త యుద్ధంలో మేము బలైపోతున్నాం" అంటారు. కేరళ జర్నలిస్టు రేజాజ్ 26 సం॥ల కేరళ కుర్రాడు. అతన్ని మే 7న నాగపూర్ పోలీసులు పుణెలో అరెస్టు చేశారు. అతని మీద ఏమి కేసులు పెట్టాలో తెలియక ఈ పది రోజుల్లో రకరకాల కేసులు పేర్కొంటూ పోయారు. మొదట ఆపరేషన్ సిందూర్‌ని వ్యతిరేకించాడన్నారు. భారత సైనిక చర్యలను వ్యతిరేకించాడు కాబట్టి అతన్ని దేశద్రోహి అన్నారు. "ద వైర్"లో శాంత సుకన్య రాసిన దాని ప్రకారం చివరిగా అతనికి కబీర్ కళామంచ్‌తో సంబధాలు ఉన్నాయని పోలీసు ఆరోపణ, నాగపూర్ వెళ్లే ముందు. రేజాజ్ ఢిల్లీ వెళ్లి అక్కడ ఒక పౌరసమాజం నిర్వహించిన ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేక ప్రచారం' అనే సదస్సులో పాల్గొన్నాడట.

### యుద్ధాలు లేని ప్రపంచం కోసం యుద్ధం చేద్దాం!

నాలుగు రోజుల యుద్ధం సరిహద్దు గ్రామాల్లో విషాదాన్ని మిగిల్చింది. కూలిపోయిన ఇళ్లు, కళ్లముందే ప్రాణాలు కోల్పోయిన ఆప్తులు, గాయాలపాలైన పిల్లలు, పెద్దలు భయకంపితులైన పిల్లలు, బాలాకోట్ దాడిలో ఉగ్రవాదాన్ని అంతం చేశామన్నారు. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ విరామమే తప్ప ముగింపు కాదంటున్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసే మంత్రమేమిటి? రాజకీయ నాయకులు కేసులు పెడతామని ఎంత బెదిరించినా ఆపరేషన్ సింధూర్‌ని భారతదేశంలో చాలామంది వ్యతిరే కించారు. అసలు నిందితులను పట్టుకోవాలని కోరారు. రెండు దేశాలు కూర్చొని మాట్లాడు కోవాల్సిన విషయాలను మిలటరీ ఆపరేషన్స్ దాకా తీసుకొని వెళ్లనవసరం లేదని చాలామంది అభిప్రాయ పడ్డారు. యుద్ధంలో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా రెండు దేశాల్లోనూ సామాన్య పౌరులకు మిగిలేది అంతులేని విషాదమే. యుద్ధం ఒక సామూహిక మానవ హననకాండ. యుద్ధాల్లో పాల్గొనే సాధారణ సైనికులు కూడా శాంతినే కాంక్షిస్తారు. విధినిర్వహణకే తప్ప ఉత్తపుణ్యానికి యుద్ధం చేయాలని కోరుకోరు. సైనికుల కుటుంబాలు యుద్ధాలు లేని సమాజాన్నే కోరుకుంటారు. ఆధిపత్య దేశాలు ఒకవైపు శాంతి ప్రవచనాలు చెబుతూనే మరొకవైపు ఆయుధ వ్యాపారాలు సాగిస్తున్న నేపథ్యంలో వర్ధమాన దేశాలు యుద్ధాలను వ్యతిరేకించడం ద్వారా బలిసిన దేశాల ఆధిపత్యానికి గండికొట్టాలి.

# ఉద్యమ వార్తలు

# మ్యానువల్ కౌన్సిలింగ్ పై నిరసనలు - దీక్షలు

### శ్రీకాకుళం

సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూలై 8న డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించారు. మాట తప్పవద్దు... మడమ తిప్పవద్దు అంటూ ఉపాధ్యాయుల నినాదాలతో ఉమెన్స్ కాలేజీ రోడ్డు దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిషోర్ కుమార్ మాట్లాడుతూ గతంలో మాన్యూవల్ కౌన్సిలింగ్‌కు మాట ఇచ్చి... ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ అంటూ మాట మార్చడం సరికాదన్నారు. సంఖ్యాపరంగా అత్యధికంగా ఉన్న ఎసిటి ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ చాలా ఇబ్బందికరమని, వేలాదిగా ఆప్షన్స్ పెట్టుకోవడం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలు ఏవి ఇవ్వకపోయినా ఉపాధ్యాయ సంఘాలు సంయమనం పాటిస్తున్నాయని, కానీ, ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఇటువంటి మానసిక సంఘర్షణకు ఉపాధ్యాయులను గురి చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ప్రారంభం కాకముందే ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడాన్ని తప్పుబట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. పిఆర్టీయు జిల్లా శాఖ అధ్యక్షులు తంగి మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలకు ముందు హామీ ఇచ్చి తర్వాత మండల కేంద్రాలకు వచ్చి వెబ్ ఆప్షన్లు పెట్టుకోమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియకు ముందు ప్రభుత్వం మాన్యువల్ గా బదిలీలు చేస్తామని హామీ ఇవ్వడంతో పరిష్కారాన్ని లభించిందని ఎందని భావించామన్నారు. కానీ, చివరలో వెబ్ కౌన్సెలింగ్ అని ప్రకటించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఐక్యవేదిక సంఘ నాయకులు ఎల్.బాబూరావు, సిహెచ్. రవీంద్ర, జి.గిరిధర్, పి.అప్పారావు, జి.రమణ, బి.వెంకటేశ్వర్లు, కె.సోమేశ్వరరావు, బి. రమేష్, బోనెల రమేష్, జి.గోపాలరావు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

### విజయనగరం

ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాల్సిందేనని ఉపాధ్యాయులు కదం తొక్కారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ను జూలై 8న ముట్టడించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్కు ఉపాధ్యాయులు చేరుకున్నారు. డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్ళ ఒడగా పోలీసులు అడ్డుకుని, కలెక్టరేట్ గేట్లు మూసివేశారు. దీంతో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఉపాధ్యాయులు బైఠాయిం చారు. ఆన్లైన్ కౌన్సిలింగ్ వద్దు, మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిం చాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ కౌన్సిలింగ్‌లో పాల్గొనేది లేదని తెగేసి చెప్పారు. ఉపాధ్యా యులతో ఆడుకోవాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కలెక్టరేట్ రెండు గేట్లు మూసివేయించి ముట్టడి కొనసాగించారు. ఒంటిగంట సమయంలో కలెక్టరేట్ కూడలిలో రాస్తారోకో నిర్వహించి, ముట్టడి కార్యక్రమం ముగించారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఏవిఆర్ ఈశ్వరరావు, నాయకులు రమేష్ చంద్రపట్నాయక్, డి. రాము, కె.విజయగౌరి, పిఆర్టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జ్, ఎస్‌టియు నాయకులు, ఎపిటిఎఫ్ - 1938, ఆపస్ జిల్లా అధ్యక్షులు, పిఆర్‌టియు నాయకులు, ఎపిటిఎఫ్ -257, ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విశాఖపట్నం

'మాయాదారి వెబ్ వద్దు.. మాన్యువలే ముద్దు' అంటూ ఉపాధ్యాయులు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని జూలై 8న ఆదివారం ముట్టడించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఉదయం నుంచీ నిరసన నినాదాలతో డిఇఒ కార్యాలయం పరిసరాలు హోరెత్తాయి. స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్జి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ మాత్రమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా వందలాది ఆప్షన్స్ ఎంచుకోవడం చాలా కష్టతరమని పేర్కొన్నారు. మాన్యువల్ కౌన్సిలింగ్లో అయితే ఆయా స్థానాలపై అవగాహనతో ఎంచుకోవడం సులభమవుతుందన్నారు. గత ప్రభుత్వం విద్యాశాఖలో ఉపాధ్యాయ సంఘాల ప్రమేయం లేకుండా పనికిమాలిన నిర్ణయాలు చేసి ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను నాశనం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమ సూచనలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

అనంతరం ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్ జెడి) విజయ భాస్కర్‌కు, విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జూలై 9న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ మెంబర్, యుటిఎఫ్ నాయకులు గొంది చిన్నబ్బాయి, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎపిటిఎఫ్ 257 జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, ఎస్టియు నాయకులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఎస్జిటిలకు వెబ్ కౌన్సిలింగ్ వద్దని, మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి విద్యాశాఖలో నెలకొన్న బదిలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు.

### డా॥బిఆర్.అంబేద్కర్ కోనసీమ

వెబ్ కౌన్సెలింగ్ రద్దుచేసి, ఎస్ టిలకు మ్యాన్యువల్గా కౌన్సిలింగ్ జరపాలని డిమాండ్ చేస్తూ మామిడికుదురు మండల రిసోర్స్ సెంటర్ వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తరపున శనివారం ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి, సిహెచ్.కేశవరావు హాజరై ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్, పిఆర్టియు, ఆప్టా వివిధ సంఘాలకు చెందిన సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కొత్తపేట:** ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చలలో ఎస్జిటి లకు మాన్యువల్ బదిలీ కౌన్సిలింగ్కు అంగీకరించి, ఇప్పుడు వెబ్ ఆప్షన్స్ ఇవ్వమని బలవంతపెడుతున్న అధికారుల తీరును ఖండిస్తూ వెబ్ కౌన్సిలింగ్ను బహిష్కరిస్తున్నామన్నారు.

ఉపాధ్యాయులు ఆందోళన చెందకుండా వెబ్ ఆప్షన్ల ప్రక్రియను బహిష్కరించాలని స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద జూలై 7న ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు. అలాగే జూలై 8న జరుగు కాకినాడ డిఇఒ కార్యాలయం వద్ద జరుగు నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని కొత్తపేట ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో వై. మురళి, బి. శేషగిరి రావు, టి.విజయకృష్ణ, ఎ.రామచంద్ర ప్రసాద్, జి. రాంకుమార్, బి. నారాయణ, పి.భాస్కర శాస్త్రి, ఎ. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ముమ్మిడివరం:** ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ముమ్మిడివరం ఉపా ధ్యాయ సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద శనివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు విద్యాశాఖ కార్యదర్శి సమక్షంలో జరిగిన చర్చల్లో ఎస్జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే ఒప్పందాలను ఉల్లంఘించి వెబ్ కౌన్సెలింగ్కి అదేశాలను ఉపసంహరించు కోవాలని ఎంఇఒ ఉదయ భాస్కర్కి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో పి.హిమబిందు, సిహెచ్.భైరవస్వామి, ఆర్. నాగార్జున, ఎంవి. రాంబాబు, కె.ఉమా మహేశ్వరరావు, ఆర్.బి.వి. రమణ, కె.రాము, కెవిఎస్.నారాయణ, కెవిఎస్.నాగరాజు, యు.దశరథ రామయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### పశ్చిమగోదావరి

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి విద్యాశాఖలో బదిలీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు తాజాగా బదిలీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే డిమాండ్లతో స్థానిక డిఇఒ కార్యాలయాన్ని జూలై 8న ముట్టడించారు. ముట్టడికి యుటిఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ గోపీమూర్తి ఉపాధ్యాయులకు మద్దతు తెలిపి మాట్లాడారు. మే 19, 20 తేదీల్లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, విద్యాశాఖ కమిషనర్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో జరిపిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, దానికి భిన్నంగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఆన్లైన్ వెబ్ ఆప్షన్లను ఎనేబుల్ చేయడాన్ని ఖండించారు. ఇది ఉపాధ్యాయులను మోసం చేయడమేనని అన్నారు. గతంలో జరిగిన పరిణామాలు, అనుభవా లను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులపై తీవ్ర మానసిక ఒత్తిడి పెంచుతున్న వెబ్ ఆప్షన్ల పద్ధతిని విడనాడాలని హితవు పలికారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహించిన వెబ్ కౌన్సిలింగ్లో కూడా అనేక సాంకేతిక సమస్యలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారన్నారు. వేలాదిగా ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు కూడా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తే దాదాపు రెండు వేల స్కూళ్లకు ప్రయారిటీ ఆప్షన్లు ఇచ్చుకోవాలని, ఇది తీవ్ర మానసిక ఒత్తిడితో కూడిందని, అందుకే ఆ ప్రయత్నాన్ని విరమించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి సమస్యలను తెలియజేశారు. బదిలీల ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించడం కోసం ప్రతి జిల్లా నుండి ఇద్దరు ప్రతినిధులతో సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేయాలని, వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని, అవసరమైన మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి

వేగవంతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎపిటిఎఫ్ 1938 ప్రధానకార్యదర్శి, పిఆర్‌టియు అధ్యక్షులు, పిఇటిల అసోసియేషన్. నాయకులతోపాటు ఉమ్మడి జిల్లాల నుంచి 500 మంది పైబడి ఉపాధ్యాయులు హాజరయ్యారు.

### కృష్ణా

ఎస్‌జిటిల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్ గానే నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన ఆందోళన విజయవంతమైంది. మాన్యువల్‌గానే కౌన్సిలింగ్ నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. ఇటీవల విద్యా శాఖ ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూలును ప్రకటించింది. అయితే మాన్యువల్ పద్ధతిలో కాకుండా వెబ్ ఆప్షన్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిఒలో పేర్కొంది. ఈ విధానం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ విధానం రద్దు చేయాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో గత నెలలో విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో కమిషన్ స్పందించి మాన్యువల్ పద్ధతిలోనే ఎస్‌జిటి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. అయితే మళ్లీ ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు నిర్వహిస్తామని జిఒ విడుదల చేయడంతో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఉద్యమ బాట పట్టారు.

ఈ నేపథ్యంలోనే ఎస్‌జిటి ఉపాధ్యాయుల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా సాధారణ పద్ధతిలో చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జూలై 9న బందరు ధర్నా చౌక్ వద్ద రిలే నిరహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో జిల్లా నలుమూలాల నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఉపాధ్యాయులు దీక్షలో పాల్గొని విద్యా శాఖ మంత్రి తీరును ఎండగట్టారు.

ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎ ఉమా మహేశ్వ రావు మాట్లాడుతూ 2017లో కూడా ఆనాటి టిడిపి ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటే అప్పుడు కూడా యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేశామని దీంతో దిగొచ్చిన ప్రభుత్వం మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించిందని, అప్పుడు కూడా చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి అని గుర్తు చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనకరావు మాట్లాడుతూ ఎస్.జి.టి. ఉపాధ్యాయులకు వెబ్ ఆప్షన్ ద్వార బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించడం అసాధ్య మన్నారు. ఎందుకంటే ఎనిమిదిసంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి ఉపాధ్యాయుడు తప్పని సరిగా బదిలీ ఆప్షన్ పెట్టాలని మొత్తం మూడు వేల ఆప్షన్‌లు పెట్టాల్సి ఉందని ఇది సాధ్యపడే పనేనా అని ప్రశ్నించారు. కాబట్టి ప్రభుత్వాలు ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు విరమించుకుని మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహిస్తే ఉపాధ్యాయులందరూ సంతోష పడతారని స్పష్టం చేశారు.

దీక్షలో యుటిఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షులు షౌకత్ హుస్సేన్, ఎన్టీఆర్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.సుందరయ్య, కృష్ణా జిల్లా గౌరవ అధ్యక్షులు జె.లెనిన్‌బాబు, ఎపిటిఎఫ్, ఎస్‌టియు నాయకులు, ఏపీటిఎఫ్ 257, ఏపీటిఎఫ్ 1938, పిఆర్‌టియు తదితరులు పాల్గొన్నారు.

### గుంటూరు

సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీల ప్రక్రియలో వెబ్ కౌన్సెలింగ్ విధానం అంగీకరించబోమని, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. వెబ్ కౌన్సెలింగు ఉపసంహరించుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జూలై 8న గుంటూరు డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించారు.

ఈ ముట్టడిలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌జిటి బదిలీల కౌన్సిలింగ్ ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. బదిలీల ప్రక్రియకు ముదు ఉపాధ్యాయ సంఘాలతో అధికారులతో చర్చల సందర్భంగా ఎస్టీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరగా అధికారులు అంగీకరించార న్నారు. వేల సంఖ్యలో ఉన్న ఎస్‌జిటిలకు వెబ్ కౌన్సెలింగ్ విధానం సరికాదని, అనేక సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ఉపాధ్యాయులు వేల సంఖ్యలో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవటం కూడా కాదన్నారు.

కావున మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరగా మొదట అంగీకరించిన ప్రభుత్వం ఆచరణలో వెబ్ కౌన్సెలింగ్కు అనుగుణంగా చర్యలు చేపడుతోందని, విద్యాశాఖ అధికారుల ద్వారా ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పి ఉపాధ్యాయుల్ని వంచించిటం సరికాదన్నారు. తక్కువ సంఖ్యలో ఉండే స్కూల్ అసిసెంట్లు బదిలీల్లోనే వెబ్ కౌన్సెలింగ్ విధానంలో అనేక తప్పులు దొర్లాయని, ఒకే ప్లేస్ ఇద్దరికి కేటాయించారని, సీనియార్టీ జాబితాలోనూ అనేక తప్పులు దొర్లాయని తెలిపారు. 50 ఆప్షన్లు పెట్టుకోవాటానికి రెండు గంటలకు పైగా సమయం పట్టిందన్నారు. ఇప్పుడు ఎస్టీలు రెండు, మూడువేలకు పైగా ఆప్షన్లు పెట్టుకోవటం ఆచరణ సాధ్యం కాదన్నారు. తక్షణమే వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని ఉపసంహరించుకొని మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

అనంతరం ఐక్యవేదిక నాయకులు యుటియఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు నాయకులు పాల్గొన్నారు.

## ప్రకాశం

విద్యాశాఖ ఇచ్చిన హామీ మేరకు ఎస్జీ టీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జూలై 8న కలెక్టరేట్‌ను ముట్టడించారు. మూడు దశాబ్దాలుగా ఎస్ జిటిలకు మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహిస్తుండగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ కార్యదర్శి విద్యాహక్కు చట్టం పేరుతో వెబ్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ప్రకటించటం ఏరు దాటినాక తెప్ప తగలేసిన తీరుగా ఉందని పలువురు నేతలు మండిపడ్డారు. పూటకొక ఉత్తర్వు, గంటకొక సవరణతో ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నట్లు విమర్శించారు. ఉపాధ్యాయుల బదిలీ చట్టం పేరుతో ప్రభుత్వం తమకు అనుకూలంగా మలచుకుంటూ డబుల్ ఇంజన్ పాలన సాగిస్తున్నట్లు దుయ్యబట్టారు. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ఎస్జి, పిఇటి, పండిట్స్కు మాన్యువల్ ప్రక్రియ స్థానే వెబ్ కౌన్సిలింగ్ చేపట్టాలని విద్యాశాఖ ఆదేశాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు జూలై 8న ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి సుమారు వెయ్యి మంది ఉపాధ్యాయులు ప్రకాశం భవనం చేరుకొని సెంటర్ గేట్ వద్ద మధ్యాహ్నం ఒంటి గంట వరకు బైఠాయించారు.

ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వాకా జనార్ధన రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు మాట్లాడారు. 'యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు బదిలీల విషయంలో విద్యా శాఖామంత్రి, కార్యదర్శి స్థాయి ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్జిటి, పిండి, పండక్కు మాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేని అసమర్థత విద్యాశాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాన్యువల్ కౌన్సిలింగ్ వీలు కాదని, టెక్నాలజీ అందుబాటులో ఉంది వెబ్ కౌన్సిలింగ్ జరపాలని విద్యాశాఖ మభ్య పెట్టి ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

ఆన్లైన్ ప్రక్రియ ద్వారా నిర్వహించిన హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ బదిలీలలో గందరగోళం నెలకొందన్నారు. వందల్లో ఉన్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితానే అనేక సార్లు సరిచేసిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో సుమారు 3 వేల మంది ఉపాధ్యాయులు 3 వేల ఆప్షన్లు పెట్టుకోవడానికి టెక్నాలజీ అందుబాబులో ఇందా? అటువంటి సాఫ్ట్‌వేర్ ప్రభుత్వం రూపొందించిందా? అని ప్రశ్నించారు. మాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలని రాష్ట్ర కార్యదర్శి మొదలు, ఆర్ జెడిలను నాయకత్వం సంప్రదింపులు చేస్తుంటే అధికారులచే, ఎంఇఒల ద్వారా ఉపాధ్యాయులపై వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ఎన్ని ఒత్తిడులు చేసినా రాష్ట్రవ్యాప్తంగా 16 వేల మందికిగాను కేవలం 177 మందిలో మాత్రమే ఆప్షన్స్ పెట్టించ గలిగారని, ఇది ఉపాధ్యాయ ఉద్యమానికి నిదర్శనం అన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తే సహించేది లేదని, ప్రభుత్వ ఉండేది కేవలం నాలు గేళ్లు మాత్రమేనని, తాము 30 ఏళ్ల వరకు సర్వీస్‌లో ఉంటామని, తాము తలుచుకుంటే ప్రభుత్వాలను మార్చగలం శక్తి. తమకుందని హెచ్చరించారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మాట్లాడుతూ ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం చులకనగా చూస్తోందని విమర్శించారు. ఓఎస్టి నేరుగా ఉపాధ్యాయుల నాయకులకు ఫోన్లు చేసి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం బుల్డోజర్ పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు.

ఆపస్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులను రోడ్డుపాలు చేయటం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. మాన్యువల్ బదిలీ ప్రక్రియ ప్రభుత్వానికి పెద్ద సమస్య కాదని, ప్రభుత్వం తక్షణం దిగి రావాలని డిమాండ్ చేశారు. ఎస్టియు రాష్ట్ర నాయకులు చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ బదిలీల చట్టానికి తూట్లు పొడవడం అత్యంత మర్మార్గమని విమర్శించారు. ఎసిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవి 10 కీర్తి మాట్లాడుతూ బదిలీల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తమరు అనుకూలంగా, ఉపాధ్యాయులకు భారంగా మార్చిందని దుయ్యబట్టారు. అనంతరం ఉపాధ్యాయులంతా డీఈవో కార్యాలయ ముట్టడిని సీఐ కె.శ్రీనివాస రావు, ఎస్ ఏవీ సుబ్బారావు పోలీస్ సిబ్బందితో అడ్డుకున్నారు.

ఉపాధ్యాయులు కలెక్టరేట్ గేటును నెట్టేసి లోకి వచ్చే ప్రయత్నాన్ని పోలీసులు నిలువరించారు. డిఇఓను కలసి తమ సమస్యలను చర్చిస్తామని నాయకులు వేసిన విజ్ఞప్తిని పోలీస్ అధికారులు తోసిపుచ్చారు. నేతలు పట్టుబట్టడంతో దీని కిరణ్ కుమార్ కలెక్టరేట్ గేటు వద్దకు వచ్చి ఉపాధ్యాయ సంఘాల నేతలతో మాట్లాడారు. డిమాండ్స్‌ను వినతిపత్రం ద్వారా అందించాలని డిఇఓ సూచించడంతో, ఆయన సూచన మేరకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు.

కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి వీరాంజనేయాలు, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు, అపస్ జిల్లా అధ్యక్షులు, ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు, బిటిఎ రాష్ట్ర నాయకులు, యుటిఎఫ్ మహిళా అధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, ఇతర సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నెల్లూరు

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ మాన్యువల్ కౌన్సెలింగ్ కార్యాలయం విధానంలో మాత్రమే నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని విద్యా శాఖ జిల్లా కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. రాష్ట్రంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకతాటిపై నిలిచి

మాన్యువల్ కౌన్సెలింగ్ మాత్రమే నిర్వహించాలనే నినాదంతో నిరాహార దీక్ష చేపట్టామని నాయకులు పేర్కొన్నారు. ఈ శిబిరానికి ఉపాధ్యాయ సంఘాల స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొని ప్రసంగించారు.

విద్యా శాఖ అధికారులు నియమ నిబంధనలకు విరుద్ధంగా జాబితా తయారు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల ఇబ్బందులు పరిగణనలోకి తీసుకోకుండా మానసిక ఒత్తిడికి గురిచేసి బదిలీలకు సంబంధించిన ఆప్షన్స్ పెట్టించడం సరైన విధానం కాదన్నారు.

ఈ నిరాహారదీక్ష కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక జిల్లా స్టీరింగ్ సభ్యులు యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, చలపతి శర్మ, ఇతర ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

**చిత్తూరు**

రాష్ట్రంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను ఆన్లైన్ వెబ్ కౌన్సిలింగ్లో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో జరపాలని జూలై 8న చిత్తూరు డీఈవో కార్యాలయాన్ని ఉపాధ్యాయులు పెద్దఎత్తున ముట్టడించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన ప్రక్రియ మొత్తం ఆన్లైన్లో జరగ్గా, ఉపాధ్యాయుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుల బది బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, గత రెండు రోజులుగా బదిలీలను ఆన్లైన్లో జరపడానికి అధికారులు సమాయత్తమవడాన్ని జీర్ణించుకోలేని ఉపాధ్యాయులు జిల్లా నలుమూలల నుండి వేలసంఖ్యలో తరలివచ్చి చిత్తూరు డిఈఓ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసనను తెలియజేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు ఉద్యోగోన్నతులను నిర్వహించడానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చినప్పటికీ చట్టంలో ఉన్నట్లుగా కాకుండా మొత్తం బదిలీలు ఉద్యోగోన్నతులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, మొన్న జరిగిన స్కూల్ అసిస్టెంట్ బదిలీలలో ప్రిఫరెన్స్ క్యాటగిరి ఉపాధ్యాయులు పెద్దమొత్తంలో నష్టపోయారని, వెబ్ కౌన్సిలింగ్లో బదిలీలు నిర్వహించడం వల్లే ఇలాంటి పరిస్థితి దాపురించిందని వారు పేర్కొన్నారు. కాబట్టి సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకైనా వెబ్ కౌన్సిలింగ్ రూపంలో కాకుండా ప్రత్యక్ష కౌన్సిలింగ్ నిర్వహించి వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఉపాధ్యాయులు ఆన్లైన్లో బదిలీలు కోరుకునే క్రమంలో వేలకొద్దీ పోస్టులకు ఆప్షన్ ఇచ్చుకోవలసి ఉంటుందని, అలా ఇచ్చుకున్నప్పటికీ ఆన్లైన్ సిస్టంలో సాంకేతిక సమస్యల వలన అనేక తప్పులు జరిగి ఉపాధ్యాయులు నష్టపోతున్నారని నాయకులు ఆరోపించారు. ఆ రకంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు సంబంధించిన ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిని పరిష్కరించకపోగా, కనీసం ఫిర్యాదులు కూడా తీసుకోవడం లేదని, దీన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని వారు తెలియజేశారు. ఇలాంటి ఇబ్బందులు లేకుండా బదిలీలు జరగాలంటే వెబ్ కౌన్సిలింగ్ రూపంలో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో బదిలీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ, జిల్లా ప్రధానకార్యదర్శి కె. ముత్యాలరెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు, ప్రధానకార్యదర్శి ఎన్.మణిగండన్, జిల్లా కార్యదర్శి దీనావతి పాల్గొన్నారు.

**జూలై 9 :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను ఆన్లైన్లో కాకుండా ప్రత్యక్ష పద్ధతులో జరపాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఉపా ధ్యాయులు పెద్దఎత్తున నిరాహార దీక్ష చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికకు ఇచ్చిన హామీ మేరకు సెకండ్ గ్రేట్ టీచర్ల బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్లైన్లో బదిలీలు జరపడాన్ని నిరసిస్తూ జూలై 8న ఆయా జిల్లా కేంద్రాలలో పెద్ద మొత్తంలో నిరసన ధర్నాను నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో జూలై 9న నిరాహార దీక్షకు కూర్చున్నారు.

ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా ఆన్లైన్ పద్ధతిలో బదిలీలు జరపడం దారుణమన్నారు. గత రెండు, మూడు, దఫాలలో జరిగిన ఆన్లైన్ బదిలీలలో పెద్దమొత్తంలో ఇబ్బందులు ఎదురయ్యాయని, అనేకమందికి వారి అవకాశాల కంటే కష్టతరమైన ప్రాంతాలు కేటాయించబడ్డాయని, దానిని నివారించడం కోసం ఉపాధ్యాయ సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడి ప్రత్యక్ష పద్ధతిలో బదిలీలను కోరుకోవడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రభుత్వం ప్రత్యక్ష పద్ధతిలో బదిలీ చేరడానికి అంగీకరిస్తూనే, మరోపక్క ఆన్లైన్లోనే బదిలీలు జరపడానికి ఉత్తర్వులు ఇచ్చిందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకొని ఉపాధ్యాయులు కోరుకున్న విధంగా ప్రత్యక్ష పద్ధతిలో బదిలీలు నిర్వహించాలని, లేనిపక్షంలో జూలై 10న విజయవాడ మంగళగిరిలోని విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని నాయకులు అల్టిమేట్ ఇచ్చారు.

యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శులు జీవి.రమణ, ఎస్ఎస్.నాయుడు, చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్లు నిరాహార దీక్ష శిబిరంలో తదితరులు పాల్గొన్నారు.

**కడప**

ఎస్జిటి బదిలీలకు సంబంధించి మాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని వెబ్ కౌన్సెలింగ్ వద్దని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జూలై 8న ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డిఇఒ కార్యాలయాన్ని

ముట్టడించారు. ముట్టిడి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2 వేల మంది ఉపాధ్యాయుల హాజరై తమన నిరసన తెలియజేశారు.

'వెబ్ కౌన్సెలింగ్ వద్దు మాన్యువల్ కౌన్సిలింగ్ ముద్దు' అంటూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు నినదించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయ సంఘాలు ధర్నాకు పిలుపు ఇచ్చినప్పుడు కమిషనర్ ఎస్ టిల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు మాట తప్పి ఎజిటిలందరిని ఆన్లైన్ ద్వారా కౌన్సెలింగ్లలో వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాలని చెప్పడం దారుణమన్నారు. ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా తాను అనుకున్న విధంగానే పంతాన్ని నెగ్గించుకోవడం కమిషనర్ మొండి వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అనేక పొరపాట్లు జరిగాయని, దీని ద్వారా ఎస్టీల అధిక సంఖ్యలో ఉండడం, చాలా మంది ఉపాధ్యాయులకు వెబ్ పైన అవగాహన లేకపోవడం వల్ల వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కౌన్సిలింగ్‌ను మాన్యువల్ విధానంలోనే జరపాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాదన విజయ్ కుమార్, పాలేం మహేష్‌బాబు వివిధ సంఘ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జూలై 9 :** వెబ్ కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు నిర్వహించాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తూనే ఉంటామని ఐక్య వేదిక నాయకులు యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాదన విజయ్ కుమార్, పాలేం మహేష్‌బాబు తెలిపారు. జూలై 9న డిఇఒ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తామని ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీని అమలు పరచకుండా మోసపూరితంగా వ్యవహరించడం మంచిది కాదని చెప్పారు. విద్యాశాఖ మంత్రి అంగీకరించినట్లు కల్లిబొల్లి మాటలు చెప్పి నాటి ఉద్యమాన్ని నీరుగార్చారని పేర్కొన్నారు. ఒక ఉపాధ్యాయుడు 2,500 స్థానాలను వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవడం ఎంతో కష్టతరమని, ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి వెంటనే మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించేలాగున చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జూలై 9న మంగళగిరిలోని రాష్ట్ర విద్యా భవన్ ముట్టడి చేస్తామని తెలిపారు.

నిరసన కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, యుటిఎఫ్ నాయకులు రవికుమార్, నరసింహారావు, కృష్ణారెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కర్నూలు

ఎస్.జి.టి. ఉపాధ్యాయుల బదిలీలను ఆన్లైన్లో కాకుండా మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులను నిర్వహించడంలో విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. జూలై 8న కలెక్టరేట్లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

